వాస్తవాలు పలుకు DD9 వార్త
తెలుగు దినపత్రిక
TGTEL/26/A2635

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 144 | 05-10-2026 | సోమవారం | పేజీలు: 08 | వెల: 3/-



## ఫామ్7పై ఓవైసీ ఆగ్రహం

- ఓట్ల తొలగింపుపై తీవ్ర ఆరోపణలు
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ఓవైసీ విమర్శలు
- ఫామ్-7 దరఖాస్తులపై అనుమానాలు
- దరఖాస్తుదారుల వివరాలు లేవన్న ఎంపీ
- తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఈసీని హెచ్చరించిన ఎంఐఎం అధినేత
- హైదరాబాద్‌లో భారీ ఆందోళన చేస్తామని ప్రకటన
- ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్త ఆందోళన
- ఎన్ఆర్సీకి దారితీసే ప్రమాదమన్న ఆరోపణ
- ఓటు హక్కు, పౌరసత్వంపై ఆందోళన

2



## ఉపఎన్నికకు కాంగ్రెస్ భయపడుతోంది

- ఓటమి భయంతోనే ఎన్నికను అడ్డుకుంటున్నారు
- ఖైరతాబాద్‌లో బీజేపీదే గెలుపు: డీకే అరుణ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ ఫైర్
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తీవ్ర విమర్శలు
- ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్

2



## తెలంగాణకు వర్ష సూచన.. పలు జిల్లాల్లో వానలు

- తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక
- ఉరుములతో కూడిన వర్షాలు పడే ఛాన్స్
- కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు
- వర్షా కాలం ముగింపు సమయంలో వానలు

2

## తెలంగాణ ఎంపీలకు కీలక బాధ్యతలు



2

# కరువు మండలాలు ప్రకటించాలి

- తెలంగాణలో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్న కవిత
- వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్
- భూగర్భ జలాలు 20 అడుగులు పడిపోయాయని వెల్లడి
- రైతులకు కరెంట్ అందడం లేదని ఆరోపణ
- ఆరు గంటలకు మించి విద్యుత్ ఇవ్వడం లేదని విమర్శ
- రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర ఆరోపణలు
- కొండారెడ్డిపల్లికి రావాలని సీఎంకు సవాల్
- విద్యుత్ కోతలను నిరూపిస్తానన్న కవిత
- కృష్ణా, గోదావరి నీటిని వినియోగించలేదని ఆరోపణ
- రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్



**హైదరాబాద్, (డీడీ9 వార్త):** తెలంగాణలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు 20 అడుగుల మేర పడిపోయాయని కవిత తెలిపారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు ప్రభుత్వం ఆరు గంటలకు మించి విద్యుత్ ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు. విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కవిత ప్రశ్నించారు. విద్యుత్ కోతలు లేవని ప్రభుత్వం చెబితే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని కవిత సవాల్ చేశారు. అక్కడే విద్యుత్ పరిస్థితిని నిరూపిస్తానని అన్నారు. రైతులకు కరెంట్ ఇవ్వాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏం చేసైనా రైతులకు విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.

కృష్ణా, గోదావరి నదుల్లో నీరు నిండుగా ఉన్నప్పటికీ రాష్ట్రంలోని మిగతా 2 లో..



## శ్వేత విప్లవంలో తెలంగాణ కీలక పాత్ర

- తూప్రాన్‌లో అమూల్ డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ
- రూ.400 కోట్లతో అత్యాధునిక పరిశ్రమ ఏర్పాటు
- 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడి
- స్థానిక యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు
- పాల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ముందంజలో ఉందన్న కిషన్‌రెడ్డి
- శ్వేత విప్లవంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని పిలుపు
- గ్రామాల్లో సహకార సంఘాలను బలోపేతం చేయాలని సూచన
- తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు నిర్ణయం
- పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం: శ్రీధర్‌బాబు
- పాడి రైతులకు మేలు చేయడమే లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్, (డీడీ9 వార్త):** తెలంగాణలో శ్వేత విప్లవం మరింత బలోపేతం కావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పాల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ముందంజలో ఉందని చెప్పారు. ఈ రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రహ్మణపల్లిలో అమూల్ సంస్థకు చెందిన సాబర్ డెయిరీ తెలంగాణ ప్రాజెక్టుకు ఆదివారం భూమిపూజ జరిగింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ రఘునందన్‌రావు, కంపెనీ చైర్మన్, ఇతర అధికారులు మిగతా 2 లో..

## ప్రింటెడ్ ఫారం-7పై అనుమానాలు

- ఓటర్ల పేర్ల తొలగింపునకు ప్రింటెడ్ దరఖాస్తులు
- హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో వెలుగులోకి
- ముషీరాబాద్‌లో మూడు రోజుల క్రితం గుర్తింపు
- బహదూర్‌పురలో శుక్రవారం లభించిన ఫారాలు
- గోషామహల్‌లోనూ శనివారం ప్రత్యక్షం
- ఫారం-7ను ప్రింట్ చేసి కట్టలుగా అందిస్తున్న వైనం
- దరఖాస్తుల వెనుక ఎవరు ఉన్నారన్న ప్రశ్నలు
- రాష్ట్రవ్యాప్తంగా 29 వేల దరఖాస్తులు
- సీఈవోకు కాంగ్రెస్ ఎన్నికల విభాగం ఫిర్యాదు
- బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్



**హైదరాబాద్, (డీడీ9 వార్త):** తెలంగాణలో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించిన ప్రింటెడ్ ఫారం7 దరఖాస్తులు కలకలం రేపుతున్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఇలాంటి దరఖాస్తులు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా చేతిరాతతో వచ్చే ఫారం7 దరఖాస్తులు.. ఇక్కడ ఓటర్ల వివరాలను ముందే ప్రింట్ చేసి కట్టలుగా బూత్ లెవల్ అధికారులకు అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఈ దరఖాస్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు ప్రింట్ చేస్తున్నారు? బీఎల్‌వోలకు ఎవరు అందిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

**పలు నియోజకవర్గాల్లో గుర్తింపు**

హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఓ పోలింగ్ బూత్ పరిధిలో మూడు రోజుల క్రితం ప్రింటెడ్ ఫారం7 దరఖాస్తులు లభించాయి. ఈ ఘటనపై ఎన్నికల అధికారులు విచారణకు ఆదేశించారు. రాజధాని నగరంలోని బహదూర్‌పుర నియోజకవర్గంలో శుక్రవారం ఇలాంటి దరఖాస్తులు కనిపించాయి. తాజాగా శనివారం గోషామహల్ నియోజకవర్గంలోనూ ప్రింటెడ్ ఫారం 7 పత్రాలు లభించాయి. దీంతో ఇది ఒక్క ప్రాంతానికే పరిమితమైన వ్యవహారమా? లేక రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోందా? అనే చర్చ మొదలైంది.

**ఫారం-7 ఎందుకు?**

కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం6 మిగతా 2 లో..

# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- వెయ్యి రోజులు దాటినా హామీలు అమలు కాలేదు
- మైనారిటీలకు రూ.4 వేల కోట్ల హామీ ఏమైంది?
- మైనారిటీ సంక్షేమంపై కేటాయింపులు తగ్గాయి
- గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది
- విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లు ఎందుకు ఆలస్యం?
- మైనారిటీ కార్పొరేషన్ ఉద్యోగులకు జీతాల్లేవు
- ఉర్దూ అకాడమీ ఉద్యోగులకు ఏడాదిగా జీతాల్లేవు
- కల్యాణలక్ష్మి బకాయిలు వెంటనే చెల్లించాలి
- గజ్వేల్‌లో అభివృద్ధి మందగించింది
- మల్లన్నసాగర్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి



**హైదరాబాద్, (డీడీ9 వార్త):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పారని, వెయ్యి రోజులు దాటినా వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మైనారిటీలకు ప్రతి ఏడాది రూ.4 వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిగతా 2 లో..

## మహిళల పట్ల పోలీసుల అసభ్య ప్రవర్తనపై అమిత్ షా సమాధానం చెప్పాలి

- లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- జంతర్ మంతర్ నిరసనల్లో పోలీసుల తీరుపై ఆరోపణలు
- మహిళా జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించారన్న ఫిర్యాదులు
- అమిత్ షా సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్
- పోలీసులపై ఫిర్యాదులను క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ
- నిష్పక్షపాత దర్యాప్తు చేపడతామని ఢిల్లీ పోలీసుల వెల్లడి
- జర్నలిస్టుల కెమెరాలు లాక్కున్నారన్న రాహుల్
- పలువురిని అదుపులోకి తీసుకున్నారని కాంగ్రెస్ నేత ఆరోపణ



**న్యూఢిల్లీ, (డీడీ9 వార్త):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం జరిగిన నిరసనల్లో మహిళా జర్నలిస్టుల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర హోంమంత్రి మిగతా 2 లో..

## అయోధ్య విరాళాల కేసుపై కాంగ్రెస్ ఫైర్

- కేసును ముగించేందుకు మోదీ సర్కార్ తొందరపడుతోందన్న కాంగ్రెస్
- దర్యాప్తులో కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శ
- చోరీ కేసులో 105 ఘటనలు నమోదయ్యాయని వెల్లడి
- ఈ ఘటనలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయని కాంగ్రెస్
- ఇప్పటివరకు రూ.79.85 లక్షలు మాత్రమే రికవరీ చేశారని ఆరోపణ
- చంపత్ రాయ్ వద్దకు జూన్ 4న చోరీ వీడియో చేరిందని వెల్లడి



**హైదరాబాద్, (డీడీ9 వార్త):** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసును ముగించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొందరపడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కేసు దర్యాప్తులో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వంటి మిగతా 2 లో..



# తెలంగాణ ఎంపీలకు కీలక బాధ్యతలు

- **పార్లమెంటరీ కమిటీల్లో తెలంగాణకు ప్రాధాన్యం**
- **పలు కీలక కమిటీల్లో ఎంపీలకు చోటు**
- **విదేశీ వ్యవహారాల కమిటీలో ముగ్గురు ఎంపీలు**
- **పరిశ్రమల కమిటీలో ముగ్గురికి అవకాశం**
- **ఆరోగ్య కమిటీలో ఇద్దరు ఎంపీలు**
- **రక్షణ కమిటీలో దామోదర్‌రావు**
- **ఇంధన కమిటీలో ఇద్దరికి చోటు**
- **రసాయనాలు, ఎరువుల కమిటీలో ఇద్దరు**
- **సామాజిక న్యాయ కమిటీలో గోడెం నగేశ్**
- **పలు రంగాలపై తెలంగాణ ఎంపీలకు బాధ్యతలు**

**ఢిల్లీ, (డీడీ9 వార్త):**

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల్లో తెలంగాణ ఎంపీలకు కీలక బాధ్యతలు దక్కాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలు, పలు రంగాల పనితీరును పరిశీలించే వివిధ కమిటీల్లో రాష్ట్రానికి చెందిన ఎంపీలకు సభ్యత్వం లభించింది. మొత్తం పలు కీలక కమిటీల్లో తెలంగాణ ఎంపీలకు చోటు కల్పించారు.

విదేశీ వ్యవహారాల కమిటీలో బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణతో పాటు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సభ్యులుగా ఉన్నారు. దీంతో విదేశాంగ విధానానికి సంబంధించిన అంశాలపై చర్చించే కమిటీలో తెలంగాణ నుంచి ముగ్గురు ఎంపీలకు అవకాశం దక్కింది.

గృహ, పట్టణ వ్యవహారాల కమిటీలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి సభ్యత్వం లభించింది. పట్టణ ప్రాంతాల అభివృద్ధి, గృహ నిర్మాణం వంటి అంశాలపై ఈ కమిటీ పరిశీలన చేస్తుంది.

వాణిజ్య వ్యవహారాల కమిటీలో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరికి చోటు దక్కింది. దేశ వాణిజ్యం, ఎగుమతులు, దిగుమతులు, సంబంధిత విధానాలపై ఈ కమిటీకి కీలక పాత్ర ఉంటుంది.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిటీలో బి.పార్థసారథిరెడ్డి, కడియం కావ్య సభ్యులుగా నియమితులయ్యారు. ప్రజారోగ్యం, వైద్య సేవలు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ఈ కమిటీ పరిశీలన చేస్తుంది.

పరిశ్రమల కమిటీలో ధర్మపురి అర్వింద్, మల్లు రవి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అవకాశం లభించింది. పరిశ్రమలు, పారిశ్రామిక విధానాలకు సంబంధించిన అంశాలపై ఈ కమిటీ పనిచేస్తుంది.

సిబ్బంది, ప్రజాఫిర్యాదులు, చట్టం, న్యాయ వ్యవహారాల కమిటీలో ఎం.రఘునందన్‌రావు సభ్యుడిగా ఉన్నారు. ప్రభుత్వ పరిపాలన, ప్రజా ఫిర్యాదులు, చట్టపరమైన అంశాలపై ఈ కమిటీ పరిశీలన చేస్తుంది.

సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, వాతావరణ మార్పుల కమిటీలో గడ్డం వంశీకృష్ణకు సభ్యత్వం లభించింది. సాంకేతిక అభివృద్ధితో పాటు పర్యావరణం, వాతావరణ మార్పులకు సంబంధించిన అంశాలపై ఈ కమిటీ దృష్టి పెడుతుంది.

రవాణా, పర్యాటకం, సాంస్కృతిక కమిటీలో సురేశ్‌కుమార్ షెట్కార్ సభ్యుడిగా ఉన్నారు. రవాణా వ్యవస్థ, పర్యాటక రంగం, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన విధానాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. రసాయనాలు, ఎరువుల కమిటీలో పోరిక బలరాం నాయక్, ఈటల రాజేందర్‌కు చోటు దక్కింది. వ్యవసాయానికి కీలకమైన ఎరువుల సరఫరా, రసాయనాల రంగానికి సంబంధించిన అంశాలపై ఈ కమిటీ పనిచేస్తుంది.

ఇక బొగ్గు, గనులు, ఉక్కు కమిటీలో అనిల్‌కుమార్ యాదవ్ సభ్యుడిగా నియమితులయ్యారు. సమాచార ప్రసార, సమాచార సాంకేతిక కమిటీలో రఘురామిరెడ్డికి అవకాశం లభించింది. ఆహారం, ప్రజాపంపిణీ కమిటీలో ఆర్.కృష్ణయ్య సభ్యుడిగా ఉన్నారు. రక్షణ కమిటీలో దామోదర్‌రావుకు చోటు దక్కింది.

ఇంధన కమిటీలో వేంనరేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి సభ్యులుగా నియమితులయ్యారు. సామాజిక న్యాయం, సాధికారత కమిటీలో గోడెం నగేశ్‌కు అవకాశం లభించింది. పెట్రోలియం, సహజవాయువు కమిటీలో వద్దిరాజు రవిచంద్ర సభ్యుడిగా నియమితులయ్యారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విధానాలు, పథకాలు, సంబంధిత రంగాల పనితీరును పరిశీలించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ కమిటీల్లో తెలంగాణకు చెందిన ఎంపీలకు పలు కీలక రంగాల్లో బాధ్యతలు దక్కడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# శ్వేత విప్లవంలో తెలంగాణ కీలక పాత్ర

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూమిపూజ అనంతరం కిషన్‌రెడ్డి రైతులతో ముఖాముఖి నిర్వహించారు.

**రూ.400 కోట్లతో ప్లాంట్**

తూప్రాన్‌లో అమూల్ డెయిరీ పరిశ్రమను రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ప్లాంట్ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే స్థానిక యువత, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు.

**సహకార సంఘాలను బలోపేతం చేయాలి**

గ్రామాల్లో సహకార సంఘాల్లో రాజకీయాలు ప్రవేశించడంతో అవి నిర్వీర్యమయ్యాయని కిషన్‌రెడ్డి అన్నారు. వాటిని తిరిగి బలోపేతం చేసుకోవాలని సూచించారు. రైతులంతా కలిసి సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

**కొత్తగా 1,525 సంఘాలు**

కేంద్ర ప్రభుత్వం కొత్తగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని కిషన్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రత్యేకంగా ఈ శాఖ లేదన్నారు. సహకార రంగం ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అమిత్ షాను సహకార శాఖ మంత్రిగా నియమించిందని చెప్పారు. పాల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడుతున్నారని తెలిపారు. తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

**పరిశ్రమలకు పూర్తి సహకారం**

తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలకు పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో పాడి రైతులు విజయ డెయిరీపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. అమూల్ డెయిరీకి గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఎంపీ రఘునందన్‌రావు ప్రతిపాదన చేసిన వెంటనే అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

**పాడి రైతులకు మేలు చేయడమే లక్ష్యం**

పాడి రైతులకు మేలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు చెప్పారు. ఇప్పటికే పాల మద్దతు ధరను పెంచామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. పాడి పరిశ్రమ రైతులకు అదనపు ఆదాయ వనరుగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# కరువు మండలాలు ప్రకటించాలి

**మొదటిపేజీ తరువాయి**

ప్రాజెక్టులను ఆ నీటితో నింపలేదని కవిత ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

వర్షాలు లేకపోవడంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా మారుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరుణ యాగం చేసినా వర్షాలు కురవలేదని కవిత వ్యాఖ్యానించారు. దీంతో ఆయన చేతులెత్తేశారని వ్యంగ్యంగా అన్నారు.

రైతులకు అవసరమైన నీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. తక్షణమే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

**మొదటిపేజీ తరువాయి**

మైనారిటీల కోసం రూ.1,800 కోట్ల వరకు ఖర్చు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మైనారిటీ సంక్షేమానికి కేటాయింపులు, ఖర్చు తగ్గాయని ఆరోపించారు.

**మైనారిటీ గురుకులాలపై విమర్శలు**

మైనారిటీ గురుకులాల నిర్వహణ గాడితప్పిందని హరీశ్‌రావు అన్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని చెప్పారు. విదేశీ విద్య కోసం మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను సకాలంలో ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. మైనారిటీకార్పొరేషన్‌ఉద్యోగులకునెలలుగాజీతాలు అందడంలేదనిఆరోపించారు.ఉర్దూఅకాడమీఉద్యోగులకుఏడాదిగాజీతాలుఇవ్వలేదనిఅన్నారు.

**కల్యాణలక్ష్మి బకాయిలు చెల్లించాలి**

కల్యాణలక్ష్మి పథకం బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 2 లక్షల మంది కల్యాణలక్ష్మి చెక్కుల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.

కేసీఆర్ హయాంలో ప్రతి ఏడాది సుమారు 2.50 లక్షల మంది ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.2,600 కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ఎన్నికల హామీ కాకపోయినా కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. పేద కుటుంబాలకు పెళ్లి తర్వాత అందాల్సిన సాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

**గజ్వేల్‌లో అభివృద్ధి తగ్గింది**

కాంగ్రెస్ పాలనలో గజ్వేల్‌లో అభివృద్ధి మందగించిందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

కేసీఆర్ హయాంలో గజ్వేల్‌లో రోడ్లు, డ్రైనేజీ, ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలల్లో అభివృద్ధి జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కొత్త అభివృద్ధి పనుల కంటే 'ఇళ్లు, దుకాణాలు అద్దెకు' అనే బోర్డులే కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజలు ఎవరు ఏం చేశారో గమనిస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. పనులు చేసిన వారినే ప్రజలు గుర్తిస్తారని, మాటలు చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు.

**మల్లన్నసాగర్‌పై ఆరోపణలు**

కేసీఆర్ మల్లన్నసాగర్‌ను అద్భుతంగా నిర్మించారని హరీశ్‌రావు అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ద్వారా గజ్వేల్‌కు సాగునీరు అందించే ప్రయత్నం చేశామని తెలిపారు. కన్నెపల్లి నుంచి నీటిని విడుదల చేస్తే మల్లన్నసాగర్‌కు నీరు వస్తుందని చెప్పారు. అయితే నీటిని విడుదల చేయకపోవడంతో మల్లన్నసాగర్‌కు నీరు అందడం లేదని ఆరోపించారు.

కాళేశ్వరం కూలిపోయిందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. మల్లన్నసాగర్ పనుల్లో ఇంకా సుమారు 5 శాతం పెండింగ్‌లో ఉందని తెలిపారు. కోర్టు కేసులను పరిష్కరించి మిగిలిన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

మల్లన్నసాగర్ నీటిని హైదరాబాద్‌కు తరలించేందుకు భారీ పైపులైన్లు వేశామని చెప్పారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# అయోధ్య విరాళాల కేసుపై కాంగ్రెస్ ఫైర్

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తులను ప్రభుత్వం కాపాడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ వ్యవహారంపై పలు ప్రశ్నలు సంధించారు. ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించే మోదీ ప్రభుత్వం.. అయోధ్య విరాళాల చోరీ కేసులో మాత్రం దర్యాప్తును ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు.

**105 చోరీ ఘటనలపై ప్రశ్నలు**

అయోధ్యలో విరాళాల చోరీకి సంబంధించి 105 ఘటనలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయని జైరాం రమేశ్ తెలిపారు. అయితే ఇప్పటివరకు రూ.79.85 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు.

చోరీలకు పాల్పడిన వారిని మాత్రమే పట్టుకోవడం కాకుండా.. వారికి ఆశ్రయం కల్పించినవారు, వారి చర్యలకు మద్దతు ఇచ్చినవారు, వారి పర్యవేక్షణలో ఈ ఘటనలు జరిగినవారిపై కూడా దర్యాప్తు జరగాలని ఆయన అన్నారు.

**జూన్ 4న వీడియో..**

**21 రోజుల తర్వాత ఎఫ్ఐఆర్**

చోరీకి సంబంధించిన వీడియో జూన్ 4న చంపత్ రాయ్ వద్దకు చేరిందని కాంగ్రెస్ పేర్కొంది. అలాంటప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి 21 రోజులు ఎందుకు పట్టిందని ప్రశ్నించింది.

చోరీ ఘటనలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉన్నప్పటికీ దర్యాప్తు ఎందుకు ఆలస్యమైందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేసింది.

**నిందితులు కాకుండా సాక్షులా?**

చంపత్ రాయ్, మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రాలను ఈ కేసులో నిందితులుగా ఎందుకు చేర్చలేదని జైరాం రమేశ్ ప్రశ్నించారు. వారిని కేవలం సాక్షులుగా మాత్రమే ఎందుకు పరిగణిస్తున్నారని నిలదీశారు. దర్యాప్తు కేవలం చిన్న స్థాయి దొంగలను పట్టుకోవడానికే పరిమితమవుతోందా? లేక చోరీలు జరిగిన సమయంలో బాధ్యత వహించినవారిని కూడా జవాబుదారీ చేయడమే లక్ష్యమా? అని ప్రశ్నించారు.

**కేసును ఎందుకు ముగించాలి?**

ఇప్పటికే 105 చోరీ ఘటనలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయని, అయినప్పటికీ కేసును ముగించేందుకు ప్రభుత్వం ఎందుకు తొందరపడుతోందో చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయోధ్య విరాళాల చోరీ కేసుపై మోదీ ప్రభుత్వం ఎందుకు ఇంత ఉదాసీనంగా వ్యవహరిస్తోందని జైరాం రమేశ్ ప్రశ్నించారు. 'అధికారుల అహంకారం చివరకు ఆత్మవినాశానికి దారితీస్తుంది' అని ఆయన వ్యాఖ్యానించారు.

# మహిళల పట్ల పోలీసుల అసభ్య ప్రవర్తనపై అమిత్ షా సమాధానం చెప్పాలి

**మొదటిపేజీ తరువాయి**

అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులపై ముగ్గురు మహిళా జర్నలిస్టులు చేసిన ఫిర్యాదులను ఢిల్లీ పోలీసులు క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. నిష్పక్షపాత దర్యాప్తు కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జంతర్ మంతర్ వద్ద ఒక పోలీసు అధికారి తనతో దురుసుగా ప్రవర్తించారని ఓ మహిళా జర్నలిస్ట్ ఆరోపించారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వందలాది మంది జర్నలిస్టులు గంటల తరబడి అక్కడే ఉన్నారని తెలిపారు. "ఇది పోలీసుల ప్రాథమిక విధి కాదా?" అని రాహుల్ ప్రశ్నించారు. జర్నలిస్టుల కెమెరాలను లాక్కున్నారని, వారిని అక్కడి నుంచి ఈడ్చుకెళ్లారని ఆరోపించారు. గతంలోనూ మహిళల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించిన ఘటనలకు సంబంధించిన వీడియోలు చూశామని పేర్కొన్నారు.

**అమిత్ షా సమాధానం చెప్పాలి**

మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. శనివారం ఒక్కరోజే జంతర్ మంతర్ వద్ద వందలాది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోంశాఖ పరిధిలో పనిచేస్తున్నందున ఈ వ్యవహారంపై అమిత్ షా సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు.

**క్రైమ్ బ్రాంచ్‌కు ఫిర్యాదులు**

జంతర్ మంతర్ నిరసనల్లో పోలీసులపై ముగ్గురు మహిళా జర్నలిస్టులు లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. వారి ఫిర్యాదులను న్యూఢిల్లీ జిల్లా పోలీసులు క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఏఐఎస్ఏ కూడా ఆరోపణలు**

మహిళా నిరసనకారులు, జర్నలిస్టులు, న్యాయవాదుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆరోపించింది. పోలీసు సిబ్బంది తమను అసభ్యంగా తాకారని పలువురు మహిళలు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.

**'సత్యాగ్రహ' వేదిక ప్రారంభం**

దేశవ్యాప్తంగా జరుగుతున్న వివిధ సమస్యల ఆధారిత నిరసనలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి రాహుల్ గాంధీ 'సత్యాగ్రహ' అనే డిజిటల్ వేదికను ప్రారంభించారు. విద్యార్థులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ఇందులో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. వివిధ పోరాటాలను ఒకే వేదికపైకి తీసుకురావడమే దీని ఉద్దేశమని రాహుల్ తెలిపారు.

# ఫామ్-7పై ఓవైసీ ఆగ్రహం

- **ఓట్ల తొలగింపుపై తీవ్ర ఆరోపణలు**
- **బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ఓవైసీ విమర్శలు**
- **ఫామ్-7 దరఖాస్తులపై అనుమానాలు**
- **దరఖాస్తుదారుల వివరాలు లేవన్న ఎంపీ**
- **తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **ఈసీని హెచ్చరించిన ఎంఐఎం అధినేత**
- **హైదరాబాద్‌లో భారీ ఆందోళన చేస్తామని ప్రకటన**
- **ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్త ఆందోళన**
- **ఎన్ఆర్‌సీకి దారితీసే ప్రమాదమన్న ఆరోపణ**
- **ఓటు హక్కు, పౌరసత్వంపై ఆందోళన**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఫామ్7 ద్వారా ఓట్లను తొలగించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఫామ్7లో ఒక ఓటరు పేరు తొలగించాలని కోరుతున్నారని తెలిపారు. అయితే కొన్ని దరఖాస్తుల్లో వాటిని ఎవరు సమర్పించారనే వివరాలు ఉండటం లేదని చెప్పారు.

ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను మించి హైదరాబాద్‌లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ అంశంలో ఎంఐఎం మౌనంగా ఉండబోదని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు పోరాడతామని చెప్పారు. మహారాష్ట్ర పర్యటనలోనూ ఒవైసీ ఎస్ఐఆర్‌పై విమర్శలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను దొడ్డిదారిన జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ)గా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

ఎంఐఎం మొదటి నుంచీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తోందని చెప్పారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఎన్ఆర్‌సీ అమలుకు ఇదే ప్రక్రియను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్‌ను ప్రజలు తేలికగా తీసుకోవద్దని ఒవైసీ సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా ఓటు హక్కుతోపాటు పౌరసత్వం కూడా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# ప్రింటెడ్ ఫారం7పై అనుమానాలు

**మొదటిపేజీ తరువాయి**

ఉపయోగిస్తారు. ఓటరు వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు చేసేందుకు ఫారం8 ఉపయోగిస్తారు. ఓటర్ల జాబితా నుంచి ఒక వ్యక్తి పేరును తొలగించాలని కోరితే ఫారం7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఓటరు నకిలీ అని అనుమానం ఉన్నా, డూప్లికేట్ ఓటు ఉందని భావించినా ఫారం7 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఓటరు మరణించినా, ఇచ్చిన చిరునామాలో లేకపోయినా పేరును తొలగించాలని కోరవచ్చు.

**అధికారుల పరిశీలన తర్వాతే తొలగింపు**

ఫారం7 దరఖాస్తు వచ్చిన వెంటనే ఓటరు పేరు జాబితా నుంచి తొలగించరు. అధికారులు దరఖాస్తును పరిశీలిస్తారు. సంబంధిత వివరాలను నిర్ధారించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటారు.

సాధారణంగా బీఎల్‌వోలకు అందే ఫారం7 దరఖాస్తులు చేతిరాతతో ఉంటాయి. అయితే తాజాగా గుర్తించిన దరఖాస్తుల్లో ఓటరు పేరు, నియోజకవర్గం, చిరునామా వంటి వివరాలను ముందుగానే ప్రింట్ చేసి ఉన్నాయి. అంతేకాకుండా ఇలాంటి దరఖాస్తులను కట్టలుగా తీసుకొచ్చి బీఎల్‌వోలకు అందిస్తున్నట్లు కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

**ఎవరు ప్రింట్ చేస్తున్నారు?**

ప్రింటెడ్ ఫారం7 దరఖాస్తుల వెనుక ఎవరు ఉన్నారనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఎవరు ఈ వివరాలను సేకరిస్తున్నారు? వాటిని ఎవరు ప్రింట్ చేస్తున్నారు? బీఎల్‌వోలకు ఎవరు అందిస్తున్నారు? ఏదైనా ప్రణాళిక ప్రకారం ఈ ప్రక్రియ జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన ఉన్న బీఎల్‌వోలు ఇలాంటి ప్రింటెడ్ ఫారాలను స్వీకరించరని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అయితే ఈ విషయం తెలియని కొందరు వాటిని స్వీకరించి ప్రక్రియలోకి తీసుకెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా 29 వేల దరఖాస్తులు**

తెలంగాణలో ఇప్పటివరకు ఓటర్ల పేర్లు తొలగించాలంటూ దాదాపు 29 వేల దరఖాస్తులు ఎన్నికల అధికారులకు అందినట్లు సమాచారం. ఈ దరఖాస్తులను అధికారులు పరిశీలించనున్నారు. సంబంధిత ఓటర్లను జాబితా నుంచి తొలగించాలా? వద్దా? అనేది పరిశీలన తర్వాత నిర్ణయిస్తారు. అయితే ఈ 29 వేల దరఖాస్తుల్లో ఎన్ని ప్రింటెడ్ ఫారం7లు ఉన్నాయి? అనే అంశంపైనా దృష్టి పెట్టాలని కాంగ్రెస్ కోరుతోంది.

**అన్ని నియోజకవర్గాల్లోనూ ఉన్నాయా?**

తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే తరహా ప్రింటెడ్ దరఖాస్తులు అందినట్లు కాంగ్రెస్ ఎన్నికల విభాగం నేతలు సీఈవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రింటెడ్ ఫారం7 దరఖాస్తులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ పత్రాలను ఎవరు తయారు చేశారు? ఎవరి సూచనలతో అందించారు? అనే విషయాలను గుర్తించాలని డిమాండ్ చేశారు.

**క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్**

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు ప్రక్రియ అత్యంత కీలకమైనదని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ఎవరైనా దుర్వినియోగం చేస్తే ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రింటెడ్ ఫారం7 దరఖాస్తుల వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని కోరారు. బాధ్యులుగా తేలిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ముషీరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన ఘటనపై ఇప్పటికే విచారణకు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో.. ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి దరఖాస్తులు ఉన్నాయా? అనే అంశంపై ఎన్నికల అధికారులు దృష్టి సారించారు.

# ఉపఎన్నికకు కాంగ్రెస్ భయపడుతోంది

- **ఓటమి భయంతోనే ఎన్నికను అడ్డుకుంటున్నారు**
- **ఖైరతాబాద్‌లో బీజేపీదే గెలుపు: డీకే అరుణ**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ ఫైర్**
- **ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తీవ్ర విమర్శలు**
- **ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్**
- **ఉపఎన్నికల్లో వారిని నిలబెట్టాలని సవాల్**
- **కాంగ్రెస్ మాటలు ప్రజలు నమ్మడం లేదు**
- **బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం: ఆరోపణ**
- **మోదీ ప్రభుత్వం తెలంగాణకు నిధులిస్తోంది**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజలే బుద్ధి చెబుతారు**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

ఖైరతాబాద్ శాసనసభ ఉపఎన్నికకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. ఓటమి తప్పదనే భయంతోనే ఎన్నిక జరగకుండా అడ్డుకునేందుకు పిటిషన్లు వేయిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖైరతాబాద్‌లో గతంలో బీజేపీ విజయం సాధించిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ అక్కడ కమలం జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని డీకే అరుణ తప్పుపట్టారు. గతంలో పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటోందని విమర్శించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని ఆమె డిమాండ్ చేశారు. వారిని ఉపఎన్నికల్లో పోటీకి నిలబెట్టాలని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. పాలనపై నమ్మకం ఉంటే ఈ సవాల్‌ను స్వీకరించాలని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంతో పనిచేస్తున్నాయని డీకే అరుణ ఆరోపించారు. ఈ రెండు పార్టీల వల్ల రాష్ట్రం అప్పులపాలైందని, అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని ఆమె తెలిపారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం నుంచి సహకారం కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ స్వార్థ రాజకీయాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని డీకే అరుణ హెచ్చరించారు.

# తెలంగాణకు వర్ష సూచన.. పలు జిల్లాల్లో వానలు

- **పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక**
- **ఉరుములతో కూడిన వర్షా లు పడే ఛాన్స్**
- **కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షా లు**
- **వర్షా కాలం ముగింపు సమయంలో వానలు**
- **పలు జిల్లాల్లో వాతావరణ మార్పులు**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**
- **ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం**
- **అధికార యంత్రాంగం అప్రమత్తం**
- **వర్షా లపై వాతావరణ శాఖ ప్రకటన**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

తెలంగాణలో పలు జిల్లాలకు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది.

వర్షాకాలం ముగింపు సమయంలో ఈ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు. మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడవచ్చని చెప్పారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వర్షాల ప్రభావం ఉండే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.

# బోథ్ పట్టణంలో రూ.26 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ

- సీసీ రోడ్డు, డ్రైనేజీ, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: (డిడి 9 వార్త న్యూస్):**



బోథ్ పట్టణంలోని సాయినగర్ కాలనీలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీతో పాటు బాలికల పాఠశాల, బాలుర పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ , స్థానిక సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ-మహేందర్ తో కలిసి భూమిపూజ నిర్వహించారు.
సాయినగర్ కాలనీలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ పనులతో పాటు పాఠశాలల్లో రూ.16 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మొత్తం రూ.26 లక్షలతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులతో కాలనీ ప్రజలకు రాకపోకలు, పారిశుద్ధ్య నిర్వహణకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.
ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.
ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి అందరి సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బోథ్ మండల అధ్యక్షులు మేరుగు భోజన్న, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, పీఏసీ మెంబర్ చట్ల ఉమేష్, బోథ్ మండల అధికార ప్రతినిధి అచ్యుత్ రెడ్డి, బోథ్ మండల ప్రధాన కార్యదర్శి ఆబూద్, ఉప సర్పంచ్ పూర్ణ విజయరాజా రెడ్డి, మాజీ బ్లాక్ అధ్యక్షులు మేరుగు నరసింహ దాస్, కాంగ్రెస్ నాయకులు సాయన్న,రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.
అలాగే సాయినగర్ కాలనీ వాసులు గంగమల్లు, లింగన్న, రాజు,బుచ్చన్న,రాము తో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ టాలెంట్ టెస్ట్

- పరీక్షకు హాజరైన 700 మందికి పైగా విద్యార్థులు

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం ( డిడి 9 వార్త న్యూస్):**

బోథ్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ టాలెంట్ టెస్ట్-2026ను ఈరోజు బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ ప్రతిభా పరీక్షకు 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు పాల్గొన్నారు.
బోథ్ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి సుమారు 700 మందికీ పైగా విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకత, జ్ఞానం, పోటీ తత్వం మరియు దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించినట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు.
విద్యార్థులు పరీక్షకు ఎంతో ఆసక్తిగా హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మున్సిఫ్,జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, ఎ ఐ ఎస్ ఎఫ్ మాజీ నాయకులు గోవర్ధన్,ముక్రమ్,శ్రీకాంత్, వెంకటరమణ,సాగర్ షాహిభాజ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కేసీఆర్ కృతజ్ఞత సభ విజయవంతం

- ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు పాలెపు శ్రీనివాస్ మల్లంపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు

**ములుగు, డిడి 9 వార్త :**



02102026రోజున మల్లంపల్లి మండలంలోని భాగ్యతండలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మి పథకం ప్రారంభించి 12సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన కృతజ్ఞత సభకు హాజరై విజయవంతం చేసేందుకు ప్రజలకు,ముఖ్య అతిథులకు, పార్టీ కార్యకర్తలకు,మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులకు,సర్పంచ్లకు,మాజి సర్పంచులకు, మాజీ ఎంపీటీసీలకు, ఉప సర్పంచ్ లకు, ముఖ్య నాయకులకు,ఉద్యమకారులకు ముఖ్యంగా భాగ్యతండ మహిళా సోదరీమనులకు,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాలెపు శ్రీనివాస్ గారు పేరు పేరున కృతజ్ఞతలు.

## మధ్యాహ్న భోజన పథకం లో పనిచేస్తున్న వంట కార్మికులను రోడ్డున పడేసే సెంట్రలైజ్డ్ కిచ్చెన్ విధానం అమలు విషయంలో ముఖ్య మంత్రి గారు మనసు మార్చుకోవాలి

- నెల 28వ, తేదీన జరిగే, MLA క్యాంపు కార్యాలయాల ముట్టడి కార్యక్రమం జయప్రదం చేయండి,

**ములుగు, డిడి 9 వార్త :**

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం,మండలాల సంయుక్త సమావేశం, మండలాల అధ్యక్షులు పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి,, కుడుముల సమ్మక్క,అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయగా ముఖ్య అథిధి గా హజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గారు మాట్లాడుతూ, గత 24 సంవత్సరాలుగా వంట పథకంలో స్వంత డబ్బులు పెట్టుకొని నాన్యమైన వంటలు చేస్తూ విధ్యార్థులను స్వంత పిల్లలుగా చూస్తూ భోజనాలు అందిస్తూ వంట బిల్లులు నెలల తరబడి పెండింగ్లో ఉన్నా వంటలు చేస్తున్న వంట కార్మికులకు ఇంత వరకు పరిపాలించిన ఒక్క ప్రభుత్వం కూడా వేతనాలు పెంచకపోయినా అన్యాయం చేయలేదు అన్నారు, కానీ ఎన్నికల ముందు వంట కార్మికులకు అనేక వాగ్ధానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్న మాటలు అమలుచేయకుండా రాష్ట్రంలో ఉన్న 54200 మంది వంట కార్మికలను రోడ్డున పడేసే విధంగా, అలాగే విద్యార్థులకు కూడా నాణ్యమైన భోజనం అందచేయలేని బ్రాహ్మణ సంస్థ లైన హరేరామ హరేకృష్ణ వారికి కట్టబెట్టడానికి అల్పాహారం పేరుతోని(సెంట్రలైజ్డ్ కిచ్చెన్), విధానానికి ముఖ్యమంత్రి గారు ఆత్రుతంగా పనిచేయడం విరమించుకోవాలని డిమాండ్ చేసారు, అందుకు మంత్రి సీతక్క గారు కూడా సహకారం అందించాలని కోరారు, గత ప్రభుత్వం లో వంట కార్మికుల ధ్వారానే నిర్వహించిన అల్పాహారం పథకానికి సంబందించిన 9 నెలల అల్పాహారం బిల్లులు నేటికీ విడుదల చేయకపోవడం వల్ల కార్మికులు అప్పుల ఊబిలోకి కూరుకుపోయారు అన్నారు, కనుక పాత పెండింగ్ బిల్లులు అన్నీ వెంటనే విడుదల చేయాలని, బిల్లులు వేతనాలు ఏనెలవి ఆనెలలోనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలైన రూ,, 10,000/ వేతనాలు, వంట కార్మికులను తొలగించకుండా జీఓ విడుదల,, వంట సరుకులు, గ్యాస్, కోడిగుడ్లు, మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయడం, 12 నలలకు వేతనాలు విడుదల చేయడం, అతిముఖ్యమైన సెంట్రలైజ్డ్ కిచ్చెన్ విధానం విరమించుకొని అల్పాహారం కూడా వంట కార్మికులతోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తునారు, ఈసమస్యల పరిష్కారానికిగాను ఈనెల 28 వ, తేదీన జరిగే MLA క్యాంపు కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, ఈ సంయుక్త సమావేశంలో పాల్గొన్నవారు,ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి,యస్ కే చాంద్ పాష,వెల్దండి కొమురయ్య ,పోడెం సమ్మక్క, భండి జయ, సులోచన, రాధ, సమ్మక్క, సమ్మక్క, పాణెమ్మ, మాణిక్యం, సరోజన, చిన్నమ్మ, పద్మ, సారమ్మ,గౌరమ్మ, పెంటమ్మ, పాపమ్మ, నర్సమ్మ, లాలమ్మ, లక్కి, సమ్మక్క, మల్లమ్మ, గంగ, పార్వతి, లక్ష్మి, కొమురమ్మ, సమ్మక్క, మల్లమ్మ, నర్సమ్మ, కవిత, సరల, పద్మ, లక్ష్మి, మహేశ్వరి, సమ్మక్క, పార్వతి, నాగరాణి, రామలక్ష్మి, పద్మ, మున్నీ, వెంకటరమణ, నర్సక్క, పద్మ, సమ్మక్క, నాగేంద్ర, కుమారి, లక్ష్మి, జానకి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.




## జనగామత్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో

**జనగామ అక్టోబర్ (4 డిడి9) వార్త**

జనగామప్రబోధసేవసమితి కమిటీ సభ్యులు కొన్నే ఉపేందర్, కొన్నే అమృత బచ్చన్నపేటలోబతుకమ్మ సాంగ్ షూటింగ్ కు వచ్చిన ప్రముఖ ఫోక్ డ్యాన్సర్లు జానూ లీరి మరియు సుమన్ శివాని త్రైత సిద్ధాంత గ్రంధాలను అందించడం జరిగింది... జానూ లీరి గారికి ఇందూ సాంప్రదాయములు గ్రంథ, సుమన్ శివాని గారికి మన పండుగలు గ్రంధం అందించడం జరిగింది
వారు చాలా సంతోషంగా తీసుకుని.ఈ ఆధ్యాత్మిక గ్రంధాలు మాకు చాలా అవసరం . ఈ సినిమా జీవితం వల్ల ఎక్కువ ఒత్తిడికి అవుతాంకాబట్టి ఈ ఆధ్యాత్మికం బుక్స్ చదవడం వల్ల మరింత కార్యదీక్షలో నిమగ్నమవుతాం అన్నారు. ఇందు జ్ఞాన వేదిక జనగామ శాఖ సభ్యుడు ఉపేందర్ మాట్లాడుతూ.. శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి వారు 100 గ్రంథాలకు పైగా రచించారని ...ఆ గ్రంథాలలో భగవద్గీతలో బోధించినటువంటి కర్మయోగాన్ని విపులంగా వివరించారు. మనం ఉన్న రంగాలలో మరియు ప్రతి క్షణం పని చేస్తూనే యోగం ఏ విధంగా చేయాలనేది వివరించారన్నారు. ప్రతి యొక్కరూ అన్ని రంగాలలో ఉన్నవారు త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను చదవాలన్నారు





## మరోసారి రావణ వధ సారధిగా గండ్రకోట కుమార్ కు పట్టాభిషేకం.

**ములుగు అక్టోబర్ 04, డిడి 9 వార్త :**

ములుగు గడ్డపై 25 ఏళ్ల క్రితం ఒక చిన్న ఆలోచనగా మొదలైన రావణ వధ నేడు పూర్వ వరంగల్ జిల్లా దసరా బ్రాండ్ గా మారింది. 2001లో గడ్డితో, థర్మకోల్ షీట్ తో, బాంబుల శబ్దంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదలైన ఆ చరిత్రకు ఆధ్యుడైనాడు గండ్రకోట కుమార్
ఆనాటి నుండి నేటి వరకు నిర్విరామంగా, అప్రతిహతంగా ఈ ఉత్సవాన్ని నడిపిస్తున్న కుమార్ ను మరోసారి అధ్యక్షుడిగా ములుగు బొడ్రాయి వద్ద ధర్మ జాగరణ సమితి ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 2026 అక్టోబర్ 20న సాధన స్కూల్ పక్కన సల్లగొండ రామచంద్రారెడ్డి స్థల ప్రాంగణంలో జరగబోయే మహా రావణ వధకు ఇప్పటి నుండే సన్నాహాలు మొదలయ్యాయి.
ములుగు ప్రజలే కాదు, భూపాలపల్లి, నర్సంపేట, పరకాల నుండి 20 వేల మంది తరలివచ్చే ఈ జాతరను ఈసారి మరింత వైభవంగా నిర్వహిస్తామని గండ్రకోట కుమార్ ప్రకటించారు.
ములుగు దసరా ఉత్సవ కమిటీ నూతన సారథులు....... అధ్యక్షులుగా గండ్రకోట కుమార్ ఎన్నికవగా ప్రధాన కార్యదర్శిగా అనుమల సురేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చెలిమల్ల రాజేందర్ అడ్వకేట్, ఉపాధ్యక్షులుగా రాసమల్ల శివాజీ, ఎల్కతుర్తి శ్రీహరి, మాదరి జనార్ధన్, గాదం దేవేందర్, కొడిపాక మహేందర్, గంధం శ్రీనివాస్,కన్వీనర్ బాణాల రాజ్ కుమార్, కోకన్వీనర్ ఇమ్మడి రాము, కార్యదర్శులుగా పోరిక రాహుల్, అన్నం మోహన్, బైకాని రాజశేఖర్, ఆడెపు రాజు, రాయంచు నాగరాజు, పోరిక సునీల్,కోశాధికారి తుమ్మ అమర్నాథ్,మీడియా ఇంచార్జ్ ఆవుల వెంకన్న, నేతావత్ సుధాకర్,కార్యవర్గ సభ్యులు బోనాల శ్రీనాథ్, శ్రీరాముల విష్ణు, చిక్కుల శివాజీ, కందికొండ కుమార్,బండి శ్రీకాంత్ ,తమ్మిశెట్టి అరుణ్, అనుముల సిద్ధార్థ్ లు నియమితులయ్యారు.
ములుగు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రావణాసుర వధను జయప్రదం చేయండి అని గండ్రకోట కుమార్ పిలుపునిచ్చారు.



## మంజీరా నదిలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల మెరుపు దాడి

- 11 ట్రాక్టర్లు సీజ్
- కోటగిరి ఎస్సై శ్రీనివాస యాదవ్

**పోతంగల్(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం పరిధిలో అక్రమ ఇసుక రవాణాదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండలానికి చెందిన సుంకిని గ్రామం శివారుల్లో ప్రవహిస్తున్న మంజీరా నది పరివాహక ప్రాంతం నుండి కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది.
విశ్వసనీయ సమాచారం మేరకు అప్రమత్తమైన పోలీసులు ఆదివారం తెల్లవారుజామున సదరు ఇసుక రీచ్‌లపై హఠాత్తుగా మెరుపు దాడులు నిర్వహించారు. చీకటి పడ్డాక లేదా తెల్లవారుజామున నిఘా తక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో అక్రమార్కులు సాగిస్తున్న ఈ దందాను పోలీసులు సమర్థవంతంగా అడ్డుకున్నారు.ఈ విస్తృత తనిఖీలలో భాగంగా పోలీసులు మొత్తం 11 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 3 ట్రాక్టర్లను సుంకిని ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డుపై వెళ్తుండగా పట్టుకున్నారు. అదే సమయంలో, మంజీరా నది లోపల ఇసుకను అక్రమంగా లోడ్ చేసుకుంటున్న మరో 8 ట్రాక్టర్లను ఘటనా స్థలంలోనే పట్టుకుని సీజ్ చేశారు.
ఈ దాడికి సంబంధించిన వివరాలను ఎస్సై శ్రీనివాస్ గారు మీడియాకు వెల్లడించారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ సంపదను కొల్లగొడితే కఠిన చర్యలు తప్పవని, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై, వారికి సహకరించే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, నదీ పరివాహక ప్రాంతాలను దెబ్బతీసే ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై




## ఎమ్మెల్సీ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీలు తమ నిజాయితీని చూపించాలి

**తాడ్వాయి DD9 వార్త**

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అధికార ప్రతి పక్ష పార్టీ అధినేతలు ఈ మధ్యలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల ఐక్య కార్యాచరణ జాక్ గా వెలిసినపార్టీలు దళిత బహుజన ప్రజా సంఘాలు పేదల పెన్నిధి అని చెప్పుకొనే వివిధ సంఘాలు దేశంలో 90%జనాభా కలిగిన ఉన్నాం అధికారం మాదే మాఓట్లుతోనే రాజకీయ పార్టీలు అధికారంలోనికి వస్తున్నాయి అని చెప్పుకునే మేధావులు బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులను గెలిపించు కుంటారా అధికార ప్రతి పక్ష పార్టీలకు దాసోహం గా మారుతారా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేస్తున్న అభ్యర్థులు అందరూ విద్యావంతులు అందరూ శాఖాహారులే కోడి పిల్ల ఎలామాయమైంది అనే సామెతగా మారుతారా లేదా చూడాలి ఈ ఎన్నికల్లో దళిత బహుజన సంఘాల నాయకులు ఓటమి చెందినట్లుగా జరుగుతే ప్రజా సంఘాల పేరుతో ఉద్యమానికి ద్రోహం చేస్తున్నారని భావించి ప్రజా క్షేత్రంలో అభాసుపాలు చేయడం తప్పదని నిలదీయడంలో వెనుకాడ బోమని లంబాడా న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు దేవా నాయక్ తెలిపారు





# దేహదారుడ్యానికి క్రీడలు అవసరం.

- **చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలి.**
- **ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త / పెద్దపల్లి అక్టోబర్ 5:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ లో పెద్దపల్లి జిల్లా స్థాయి అండర్ 11, 14 బాలురు, బాలికల 70వ ఎస్ జిఎఫ్ కరాటే సెలక్షన్స్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ప మాట్లాడుతూ...గ్రామీణ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర పోటీల్లో ఈ ప్రాంత విద్యార్థులు, యువకులు ఎంతో నైపుణ్యంతో రాణిస్తున్నారని చెప్పారు. ఎస్ జి ఎఫ్ రాష్ట్ర, జాతీయ క్రీడల్లోనూ సత్తా చాటి జిల్లా పేరు నిలబెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతిభవంతులైన క్రీడాకారులకు నా వంతు సహకారం ఉంటుందని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో కరాటే ఉపాధ్యాయులు మరియు క్రీడాకారులు మరియు తదితరులు పాల్గొన్నారు




## ప్రజాసంకల్ప సేవ బైక్ యాత్ర కి సంఘీభావంగా రామగుండం తెలుగుదేశం.

- **తిరుపతి నుండి వారణాసి వరకు బైక్ యాత్ర గోదావరిఖని మీదుగా.**

**డిడి9వార్త / రామగుండం:**

రామగుండం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అక్టోబర్ 3 మోదీ సేవా ప్రస్థానానికి సంఘీభావంగా టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి వరకు టిడిపి తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవ సంకల్ప బైకు యాత్రకు పెద్దపల్లి జిల్లా టిడిపి నాయకులు రామగుండం కార్పొరేషన్ నాయకులు ఘన స్వాగతం పలికారు తిరుపతి నుంచి వారణాసి వరకు సాగుతున్న ఈ యాత్రలో పాల్గొంటున్న తెలుగు యువత నాయకులు రాత్రి 8 గంటల సమయంలో రామగుండం బి పవర్ హౌస్ గడ్డ మరియు బస్టాండ్ సమీపంలో ఘన స్వాగతం పలకడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని నిమ్మకాయల ఏడుకొండలు ఆదేశాల మేరకు ఘన స్వాగతం పలకడం జరిగింది.ఘన స్వాగతం పలికిన నాయకులు ముదిగంటి దామోదర్ రెడ్డి,పెగడపల్లి రాజనర్సు,కొండి శ్రీనివాస్, బెక్కం వీరేందర్, సుందిళ్ల స్వామి, ఇందారం రాజబాబు, బుద్ధ శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.



## బోనకల్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**బోనకల్, (డీడీ9 వార్త):**

బోనకల్ గ్రామంలో విద్యుత్ లైన్ల విస్తరణ పనులు (సోలార్) చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు బోనకల్ క్లస్టర్ విద్యుత్ శాఖ ఏఈ టి మనోహర్ వినియోగదారులకు తెలియజేశారు.నేడు 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందనీ, సినిమా టాకీస్ రోడ్డు నుంచి ఖమ్మం రోడ్డు బెంగళూరు బేకరీ వరకు, పంచాయతీ కార్యాలయం నుంచి రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి వరకు, అలాగే ఆటోమొబైల్ రాంబాబు షాపు (వత్సవాయి రోడ్డు) పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల విస్తరణ పనుల నేపథ్యంలో ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని, పనులు సజావుగా సాగేందుకు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు.



# మేడారం అభివృద్ధిపై బడే నాగజ్యోతి విమర్శలు
# ఆమె అజ్ఞానానికి పరాకాష్ట

- **తాడ్వాయి మండల కాంగ్రెస్ శ్రేణుల ధ్వజం**
- **రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క ఆద్వర్యంలో జరుగుతున్న మేడారం , తాడ్వాయి అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక బడే నాగజ్యోతి విమర్శలు**
- **మేడారం అభివృద్ధిపై అసూయ ఎందుకు?**
- **అభివృద్ధి చేస్తుంటే అభినందించాల్సింది పోయి అసూయతో విమర్శలు చేయడమేనా మీరాజకీయం బడే నాగజ్యోతి?**



**తాడ్వాయి డిడి9 వార్త**

మేడారాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతుంటే మీకు కళ్ళు మంటగా ఉందా నాగజ్యోతి రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క (ధనసరి అనసూయ) ప్రత్యేక చొరవతో, నిరంతర కృషి వల్లనే మేడారం మహా జాతర ప్రాంతం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారుమంత్రి సీతక్క నియోజకవర్గ సంక్షేమ మే ధ్యేయంగా రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకురాలు బడే నాగజ్యోతి చౌకబారు విమర్శలు చేస్తున్నారని వారు తీవ్రంగా ఖండించారు
తాడ్వాయి మండల కేంద్రంలోనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు మంకిడి నరసింహా స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు మంకిడి నరసింహా స్వామి , మాజీ అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేడారం నిధుల దుర్వినియోగం తప్ప జరిగింది ఏమీ లేదని మండిపడ్డారు నాడు అధికారంలో ఉండి మేడారం అభివృద్ధిని గాలికొదిలేసిన బీఆర్ఎస్ నాయకులకు, నేడు జరుగుతున్న ప్రగతిని విమర్శించే నైతిక హక్కు లేదని వారు హితవు పలికారు మంత్రి సీతక్క స్వయంగా మేడారంలో పర్యటిస్తూ, భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, రహదారుల నిర్మాణం, తాగునీరు మరియు పారిశుద్ధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు అని అన్నారు

**ఓర్వలేకనే ఆరోపణలు**

మంత్రికి ప్రజల్లో వస్తున్న ఆదరణను, ప్రతిష్టను తట్టుకోలేకనే నాగజ్యోతి కేవలం రాజకీయ ఉనికి కోసమే ఇటువంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారు అని , మేడారం సమ్మక్కసారలమ్మ ఆశీస్సులతో, ప్రజల మద్దతుతో నియోజకవర్గాన్ని మోడల్ గా తీర్చిదిద్దుతున్న మంత్రిపై బురదజల్లే ప్రయత్నం చేస్తే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు
బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా కుళ్లు రాజకీయాలు పక్కన పెట్టి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని, లేనిపక్షంలో వారి అబద్ధాలను ప్రజల ముందు ఎండ గడతామని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు.
రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క చొరవతో మేడారం అభివృద్ధి , తాడ్వాయి మండలంలో ఉన్న గ్రామాలకు గత కొన్ని రోజుల క్రితం కూడా ఐదు కోట్ల అరవై లక్షల రూపాయల సీసీ రోడ్ల మంజూరు జరిగితే ఓర్చుకోలేక బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదు అని మండిపడ్డారు మేడారం జాతర పరిసర ప్రాంతాల అభివృద్ధి, తాడ్వాయి మండలంలోని గ్రామాలకు భారీగా సీసీ రోడ్ల మంజూరు కావడంపై బిఆర్ఎస్ నాయకురాలు బడే నాగజ్యోతి చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అని అన్నారు ములుగు నియోజకవర్గంలో జరుగుతున్న నిజమైన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే, ఉనికి కోసమే ఆమె ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తాడ్వాయి మండలంలోని పల్లెలను, మేడారం ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తుంటే, ఆనిధుల మంజూరును చూసి బిఆర్ఎస్ నాయకులకు కడుపు మంటగా మారడం సిగ్గుచేటు ప్రజల పక్షాన సీతక్క ములుగు నియోజకవర్గ ప్రజల కష్టాలు తెలిసిన నాయకురాలిగా మంత్రి సీతక్క నిరంతరం శ్రమిస్తున్నారు. తాడ్వాయి మండలంలో దశాబ్దాలుగా రోడ్లు లేక ఇబ్బందిలు పడుతున్న ప్రతి గ్రామానికి నేడు కాంక్రీట్ (సీసీ) రోడ్ల భాగ్యం దక్కుతుంటే, ప్రజలు సంతోషంలో ఉన్నారు. కానీ ప్రజల సంతోషం బడే నాగజ్యోతికి నచ్చడం లేదు
రాజకీయ ఉనికి కోసమే ఆరాటం ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పటికీ బడే నాగజ్యోతికి బుద్ధి రాలేదు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రగతిని కళ్లారా చూస్తూ కూడా, కేవలం వార్తల్లో నిలవడం కోసం, తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం ప్రభుత్వంపై, మంత్రిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు
మంత్రి సీతక్క గతెస్తున్న నిధులను, జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే తాడ్వాయి మండల ప్రజలే బిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారు. ఇప్పటికైనా బడే నాగజ్యోతి తన కుటిల రాజకీయాలను పక్కన పెట్టి, నియోజకవర్గ ప్రగతికి సహకరించాలని, లేని పక్షంలో కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ప్రతిఘటిస్తాయని హెచ్చరిస్తున్నాము అని అన్నారు
అంకంపల్లి సర్పంచ్ ఇర్ప వెంకటేశ్వర్లు , పంబాపూర్ సర్పంచ్ ముక్తి శ్రీను , బయ్యక్క పేట సర్పంచ్ సూరకంటి సమ్మక్క గోవర్ధన్ , మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గొంది సరిత , ఆత్మ కమిటీ డైరెక్టర్ మర్రి నరేష్ , మండల నాయకులు ఆలం సాంబశివరావు , దాయ వెంకన్న , యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు చిరంజీవి , మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్ , కోటేశ్వర రావు , గజ్జెల సంపత్ , వార్డ్ మెంబర్ సభ్యులు పాయం సుజాత , సంతోష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కూటమి సంఘాల నాయకులతో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కీలక భేటీ.

**మణుగూరు. (డి డి 9వార్త)**

ఈ నెల 9వ తేదీన జరగనున్న ఆర్టీసీ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన SWF (CITU), TMU, INTUC సంఘాల ప్రతినిధులు మూడు సంఘాల కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కూటమి సంఘాల నాయకులు తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లును మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి సమావేశమయ్యారు .ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలు, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, యూనియన్ ఎన్నికలు, కూటమి సమన్వయం తదితర అంశాలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో నాయకులు చర్చించారు. మూడు సంఘాల సమన్వయంతో ఏర్పడిన కూటమి తరఫున ఎన్నికల కార్యాచరణ, ప్రచారం, నాయకుల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.
మణుగూరు ఆర్టీసీ డిపో పరిధిలో మొత్తం 241 మంది ఓటర్లు ఉన్నట్లు యూనియన్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల ప్రక్రియను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యలు, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ యూనియన్ ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్మికుల సమస్యలను ఐక్యంగా ప్రస్తావించడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.కూటమి ఎన్నికల సమన్వయానికి సంబంధించి పి.ఎస్.రెడ్డి, ఆర్.ఎమ్ రెడ్డి లు కూడా సమావేశంలో పాల్గొన్నారు.
ఈ సమావేశంలో T.R.L. చారి - INTUC డిపో సెక్రటరీ, బి. రాములు నాయక్ - తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ డిపో సెక్రటరీ, తాటి సుధాకర్ - SWF (CITU) డిపో సెక్రటరీ, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (TWU) నాయకులు, కూటమి నాయకులు, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





## కూచిరాజపల్లి శివారులో బోర్ మోటార్ చోరీ

- **రూ.35 వేల విలువైన 5 హెచ్‌పీ మోటార్ అపహరణ.. పోలీసులకు ఫిర్యాదు**

**పెద్దపల్లి బ్యూరో, (డీడీ9 వార్త):**

కూచిరాజపల్లి శివారులోని పెద్దమ్మగుడి తాళ్ల చెట్టు ప్రాంతంలో వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన బోర్ మోటార్ చోరీకి గురైంది. సర్వే నంబర్ 34లో అంబటి సతీష్ కుమార్ (తండ్రి మధునయ్య), అంబటి శంకర్ (తండ్రి బలరాం), అంబటి సతీష్ కుమార్ (తండ్రి కొమురయ్య)లకు చెందిన సుమారు 4.5 ఎకరాల భూమిని శ్రీరామ్‌నగర్‌కు చెందిన అలకుంట రాజు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు.శనివారం (అక్టోబర్ 3) సాయంత్రం వరకు పొలంలో ఉన్న 5 హెచ్‌పీ టెక్స్మో కంపెనీ బోర్ మోటార్ ఆదివారం ఉదయం కనిపించలేదు. దీంతో కౌలుదారు అలకుంట రాజు తన సహాయకుడు బాలుతో కలిసి పొలానికి వెళ్లి పరిశీలించగా మోటార్ చోరీకి గురైనట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని తెలిపారు.ఘటనపై అలకుంట రాజు మంథని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన మోటార్‌ను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు, చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.





## సివిల్ జీఎం డి. సతీష్ బాబు కు ఘన స్వాగతం కాంట్రాక్టర్ల సమస్యలపై సానుకూల స్పందన..

**మణుగూరు. (డి డి 9వార్త)**

సింగరేణి మణుగూరు ఏరియా కు విచ్చేసిన సివిల్ జనరల్ మేనేజర్ గౌరవనీయులు డి. సతీష్ బాబు గారిని, సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా మరియు పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి ఆహ్వానించారు.
అనంతరం మణుగూరు ఏరియా సివిల్ డీజీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సివిల్ జీఎం గారితో వివరంగా చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల సమస్యలను ఓపిగ్గా విన్న జీఎం డి. సతీష్ బాబు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్స్ రామచంద్రన్, ఎలమందరావు, వైస్ ప్రెసిడెంట్ మృగన్, కార్యదర్శి రాంబాబు, సహాయ కార్యదర్శి కృష్ణ,ఏ. మంగీలాల్ తదితర సభ్యులు పాల్గొన్నారు.





## ఎన్నికల సంఘం అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- **ఓటు హక్కును పరిరక్షించాలంటూ గుండాల మండల కాంగ్రెస్ నాయకుల డిమాండ్**

**గుండాల, డీడీ9 వార్త**

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆదేశాల మేరకు గుండాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గుండాల గ్రామ పంచాయతీ కాంగ్రెస్ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ ఆధ్వర్యంలో, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎస్కే ఖదీర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం అధికారి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో చిన్నచిన్న లోపాలను చూపిస్తూ ప్రజల ఓటు హక్కుకు ఇబ్బందులు కలిగించే చర్యలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. అధికారాన్ని ఉపయోగించుకుని ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణకు ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాలని కోరారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూక్య మంగమ్మ, ఉప సర్పంచ్ కొమరం రమేష్, వార్డు సభ్యులు పూనెం లక్ష్మి, సనప రాంబాబుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాడి జమాల్‌పూర్ చర్చి భూ సమస్యకు పరిష్కారం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, డీడీ9 వార్త**

సాలూర మండలం జాడి జమాల్‌పూర్ చర్చి పరిధిలోని సుమారు ఐదు ఎకరాల వ్యవసాయ భూమికి పట్టా పాస్‌పుస్తకం లేక ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఎట్టకేలకు తెరపడింది. పాస్‌పుస్తకాలు లేకపోవడంతో ప్రభుత్వం అందించే రైతుబంధు, రుణమాఫీ, సబ్సిడీ ఎరువులు, బ్యాంకు రుణాల వంటి సంక్షేమ పథకాలు దక్కక తీవ్ర నష్టం జరుగుతోందని చర్చి ఫాదర్, కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లవరపు సుందర్ రాజును కలిసి తమ సమస్యను నివేదించారు. ప్రజా సమస్య పట్ల వేగంగా స్పందించిన సుందర్ రాజు, ఈ వ్యవహారాన్ని నేరుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న భూమి సమస్యను పరిష్కరించారు. చర్చి భూ సమస్య సాకారమైన సందర్భంగా ఆదివారం చర్చిలో ప్రార్థనల అనంతరం ఫాదర్, కమిటీ సభ్యులు సుందర్ రాజును శాలువాతో సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.




## మూడు రోజుల పాటు టీయూ సీబీసీఎస్ ప్రాక్టికల్స్

**నిజామాబాద్ జిల్లా, డీడీ9 వార్త**

తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ సీబీసీఎస్ విద్యార్థులకు కల్పించిన 'వన్ టైమ్ చాన్స్' ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు మొత్తం ఆరు సెషన్లలో ఈ పరీక్షలు కొనసాగుతాయని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య సంపత్ కుమార్ వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షా సమయాలుగా నిర్ణయించారు. నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కాలేజీని పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

## రాంపల్లిని కమ్మేసిన చెత్త.. తక్షణ చర్యలకు డిమాండ్

- **మూడు నెలలుగా తరలింపు నిలిపివేత.. మరో జవహర్‌నగర్‌గా మారే ప్రమాదం**

**రాంపల్లి, డీడీ9 వార్త**

ఘట్కేశర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ రాంపల్లి గ్రామంలో చెత్త కుప్పలు పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా చెత్తను తరలించాల్సిన రాంకీ సంస్థ లిఫ్టింగ్‌ను నిలిపివేయడంతో సమస్య తీవ్రంగా మారిందన్నారు. చెత్త సేకరించే ఆటోలు వ్యర్థాలను స్థానికంగానే డంపింగ్ చేస్తుండటంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కనిపిస్తున్నాయని తెలిపారు. చెత్త కుళ్లిపోవడంతో పరిసరాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని, దోమలు, ఈగలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాంపల్లి మరో జవహర్‌నగర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకుపోయిన చెత్తను వెంటనే తరలించి, బ్లీచింగ్ తదితర పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే స్థానికులతో కలిసి ఎంఎంసీ కార్యాలయం, ఘట్కేశర్ సర్కిల్ కార్యాలయం ఎదుట, ప్రధాన రహదారులపై పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని చంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.



# త్రాగునీటిపై నిర్లక్ష్యమా? సహించేది లేదు!

- **అధికారులకు డిప్యూటీ సీఎం స్ట్రాంగ్ వార్నింగ్..**
- **స్కూళ్ల ఆధునికీకరణ, బ్రిడ్జిల పనులు వేగవంతం చేయాలి**
- **మధిరలో 10 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ**
- **జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి అధికారులతో సమీక్ష**

**ఖమ్మం/ఎర్రుపాలెం డీడీ9 వార్త:**

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఆదివారం ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వాసిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అధికారులు బాధ్యత, జవాబుదారీతనంతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

**9 పాఠశాలలకు రూ.57.69 కోట్లు**

మధిర నియోజకవర్గంలో తొమ్మిది పాఠశాలలను ఆధునికీకరించి అన్ని సదుపాయాలతో మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దేందుకు రూ.57.69 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేసి విద్యార్థులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

**బ్రిడ్జిల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి**

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బ్రిడ్జిల నిర్మాణ పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. పనులు ఆలస్యమైతే ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు ఎదురవుతాయని, నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

**10 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ**

మధిర పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో 10 వేల మంది మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రస్తుత మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రంగాల్లో శిక్షణ ఇస్తే మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

**రీ-సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలి**

భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రజా ఫిర్యాదులకు తావులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. రీసర్వే అనంతరం భూ రికార్డుల నమోదు ప్రక్రియను కూడా అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడంతో పాటు అన్ని అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు టీ. మధుసూదన్, వీ. మోహన్ రావు, సీఈ గౌతం రెడ్డి, ఎస్ఈ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, తహశీల్దార్ సునీత ఎలిజబెత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.








# పీఎల్ఆర్ బోనస్‌లో కార్మికులకు అన్యాయం..

- **జాతీయ సంఘాలు కార్మికుల శ్రమను యాజమాన్యం వద్ద తాకట్టు పెట్టాయి.**
- **సంస్థ వాస్తవ లాభాల నుంచి కార్మికులకు 36 శాతం పైగా లాభాల వాట చెల్లించాలి.**

**మణుగూరు. డీడీ9 వార్త**



ప్రకృతికి విరుద్ధమైన పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రేయింబవళ్లు కష్టపడి దేశానికి, రాష్ట్రానికి బొగ్గు అందిస్తున్న సింగరేణి కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందించడంలో జాతీయ కార్మిక సంఘాలు విఫలమయ్యాయని ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాలను యాజమాన్యం వద్ద తాకట్టు పెట్టే విధంగా జాతీయ సంఘాలు వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు.

ఆదివారం ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్2ను సందర్శించిన నాగెల్లి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శనివారం కలకత్తాలో జరిగిన అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో నాలుగు కార్మిక సంఘాలు పాల్గొని రూ.1,10,250ల లాభాల ఆధారిత బోనస్ చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోవడం కార్మికుల శ్రమకు తగిన విలువను సాధించలేకపోయినట్లేనని అన్నారు.

గతంలో రూ.1,20,000కు పైగా లాభాల ఆధారిత బోనస్ సాధిస్తామని కార్మిక వర్గం ముందు హామీలు ఇచ్చిన నాయకులు, ఇప్పుడు రూ.1,10,250 వద్ద ఎందుకు ఒప్పందం చేసుకున్నారో కార్మికులకు వివరించాలని నాగెల్లి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తికి, పారిశ్రామిక రంగానికి అవసరమైన బొగ్గును నిరంతరం అందించడంలో సింగరేణి కార్మికుల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల బోనస్ పెరుగుదలను పరిశీలిస్తే 202223లో రూ.8,500, 202324లో రూ.8,700, 202425లో రూ.9,250 పెరుగుదల కనిపించిందని, అయితే 202526లో పెరుగుదల కాకుండా రూ.7,250 తగ్గుదల కనిపిస్తోందని ఆయన తెలిపారు. ఇది కార్మికుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం సాధించడంలో జాతీయ సంఘాలు విఫలమయ్యాయని నాగెల్లి ఆరోపించారు. సింగరేణి సంస్థ 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సాధించిన లాభాల నుంచి కార్మికులకు చెల్లించాల్సిన బోనస్‌పై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడం వల్ల కార్మికులు, వారి కుటుంబ సభ్యుల్లో నిరాశ, ఆందోళన నెలకొందని అన్నారు. లాభాల వాటా బోనస్ విషయంలో ప్రభుత్వం, సర్కార్ కార్మిక సంఘాలు స్పష్టమైన వైఖరిని ప్రకటించకపోవడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. సంస్థ ప్రకటించే వాస్తవ లాభాల నుంచి కార్మికులకు 36శాతం పైగా లాభాల వాటాను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ టిబిజికెఎస్ ఆధ్వర్యంలో దశలవారీ నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. టిబిజికెఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 05 వ తేదీ సోమవారం నాడు అన్నిగనులు, డిపార్ట్‌మెంట్లలో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు నాగెల్లి తెలిపారు. 06 వ తేదీ మంగళవారం నాడు జనరల్ మేనేజర్లకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

అప్పటికీ కార్మిక లాభాల బోనస్‌పై స్పష్టమైన ప్రకటన వెలువడకపోతే సింగరేణి కార్మికుల మద్దతుతో సింగరేణి భవన్ ముట్టడి వంటి తదుపరి ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొని టిబిజికెఎస్‌కు అండగా నిలవాలని నాగెల్లి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్ కుమార్, జంగం రాజ్‌కుమార్, సాంబార్ రాజశేఖర్, శ్రావణ్ కుమార్, శివ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీ ఆపాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- **ఏఐసిసి, పిసిసి, డిసిసి మరియు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారి ఆదేశాల మేరకు..**
- **ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా..**
- **మణుగూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం.**

**మణుగూరు డీడీ9 వార్త**

ఏఐసిసి, పిసిసి, డిసిసి మరియు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆదివారం నాడు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ కోట్లాదిమంది ఓట్లు తొలగించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి అని దేశవ్యాప్తంగా 20 శాతం ఓట్లను సర్ పేరుతో తొలగించి కోట్లాదిమంది ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ దేశంలో ఓటు చోరీ సాగిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తూ ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకొని కోట్లాదిమంది ఓట్లను కొల్లగొడుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని దుయ్యబట్టారు. తక్షణమే కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ ను పదవి నుండి డిస్మిస్ చేయాలని అర్హులైన కోట్లాదిమంది ఓట్లను తిరిగి పునరుద్ధరణ చేయాలని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ దొబ్బల వెంకటప్పయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బానోత్ లక్ష్మణ్, బోనగిరి శివ సైదులు, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ కూచిపూడిబాబు ,వాసంశెట్టి వెంకట్రావు,SK. అబ్దుల్లా, లఖవత్ రాములు,చింతల కృష్ణ,పొదుతూరి నానాజీ,బొల్లి నర్సమ్మ, గనిబోయిన నాగేశ్వరరావు, దాసరి లింగయ్య, గుడికందుల ప్రసాద్,మునిగల బిక్షం, తూపూడి శ్రీను, మెరుగు రవీంద్రనాథ్ ,బెన్నీ ఏలీయా,మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు రహీమ్ పాషా, దొడ్డపిన్ని మధు కుమార్,ఉప్పు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.






DD9 వార్త తెలుగు దినపత్రిక

# పితృపక్షాల వేళ.. గోదావరికి దివ్య హారతి

- **భక్తుల రామనామ స్మరణతో మార్మోగిన భద్రాద్రి**
- **108 ప్రమిదలతో దీపోత్సవం.. గోదావరికి 21 సార్లు హారతి**

**భద్రాచలం టౌన్, అక్టోబరు 4 (డీ డీ 9 వార్త)**

పితృముక్తి క్షేత్రమైన భద్రాచలంలో మహాలయ పితృపక్షాల సందర్భంగా గోదావరి నదికి ఆదివారం దివ్య హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల జై శ్రీరామ్ నామస్మరణ, పురోహితుల వేద మంత్రోచ్చారణలతో గోదావరి తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భద్రాద్రి బ్రాహ్మణ పురోహితుల సంఘం ఆధ్వర్యంలో కరకట్ట ప్రాంతంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షుడు రామవజ్జల రవికుమార్ మాట్లాడుతూ.. శ్రీ సీతారామచంద్రస్వామి కొలువైన పుణ్యక్షేత్రంలోని గోదావరి తీరంలో నదీహారతి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దేశ, విదేశాల నుంచి భద్రాచలానికి వచ్చే భక్తులు నదీహారతిలో పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతున్నారని తెలిపారు.

ముందుగా గణపతి పూజ నిర్వహించిన అనంతరం జై శ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం చేపట్టారు. పూజా ద్రవ్యాలతో గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పఠిస్తుండగా భక్తులు 'ఓం శ్రీరామాయ నమః' అంటూ 108 సార్లు శ్రీరామనామ భజన చేశారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి 12 సార్లు, గోదావరి మాతకు 21 సార్లు హారతులు సమర్పించారు.

లోకకల్యాణం కోసం ప్రతి ఆదివారం నదీహారతి నిర్వహిస్తున్నామని రామవజ్జల రవికుమార్ తెలిపారు. తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలం కావాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గోదావరి మాతను ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందాలని కోరారు.

అనంతరం శాంతి మంత్ర పఠనం నిర్వహించారు. రామవజ్జల రవికుమార్, సత్యనారాయణరెడ్డి, రామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదం, నైవేద్యం, శనగలు పంపిణీ చేశారు. నదీహారతికి అవసరమైన పూజా సామగ్రిని భద్రాద్రి పురోహితుల సంఘం సమకూర్చింది. ఈ కార్యక్రమంలో సత్యప్రసాద్‌శర్మ, వీరభద్రశర్మ, రామాచార్యులు, తేజశర్మ, చంద్రశేఖర్‌శర్మ, తిరుపతిరావు, శివ తదితర పురోహితులు హారతులు సమర్పించారు. సత్యనారాయణరెడ్డి, మహిళా భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన సన్నద్ధం

- **డా. గడల శ్రీనివాసరావు గెలుపే లక్ష్యంగా పటిష్ట కార్యాచరణ**
- **ఓటరు నమోదు నుంచి ప్రచారం వరకు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**

**భద్రాచలం టౌన్ , అక్టోబరు 4 (డీ డీ 9 వార్త)**

రాబోయే ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన పార్టీ సన్నద్ధమవుతోంది. పార్టీ అభ్యర్థి డా. గడల శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ భద్రాచలం నియోజకవర్గంలో చేపట్టాల్సిన ఎన్నికల కార్యాచరణపై ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

ఎన్నికల కోఆర్డినేటర్లు బండి నరేష్, సుమన్, భద్రాచలం నియోజకవర్గం పీఓసీ నాయకుడు బండి రాంప్రసాద్ సమావేశానికి హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటు నమోదు, ఎన్నికల నిర్వహణ, ప్రచార కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు.

రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో జనసేన పార్టీ క్రియాశీలక పాత్ర పోషించనుందని నాయకులు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి డా. గడల శ్రీనివాసరావు విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ నాయకులు బండారు శ్రీకాంత్, దేగల శివ, పొంది వంశీ, నాచుపల్లి వెంకటేశ్వరరావు, కొండపల్లి నవీన్, నక్క సురేష్, సాయి, దుర్గాప్రసాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్టాండ్ వద్ద వృద్ధురాలి అనుమానాస్పద మృతి

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 04(డీడీ9 వార్త) :**



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ప్రాంగణంలో మంగళవారం ఓ గుర్తుతెలియని వృద్ధురాలు అచేతనంగా పడి ఉండటం స్థానికంగా కలకలం రేపింది. ప్రయాణికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వన్ టౌన్ ఎస్హెచ్ఓ రఘుపతి తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన వృద్ధురాలిని పరిశీలించిన పోలీసులు, అనంతరం స్థానిక ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహానికి ప్రాథమిక పంచనామా నిర్వహించిన పిమ్మట, పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి తరలించారు. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ రఘుపతి మాట్లాడుతూ.. మృతురాలు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే వివరాలు ఇంకా తెలియరాలేదన్నారు. వృద్ధురాలి శరీరంపై నీలం రంగు చీర ఉందని, ఆమె ఆచూకీ తెలిసినవారు లేదా బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# జిల్లా వెలమ అసోసియేషన్ పాలకవర్గం ఏకగ్రీవం

- **అధ్యక్షుడిగా బల్గూరి రాజేశ్వర్ రావు**
- **ప్రకటించిన ప్రధాన ఎన్నికల అధికారి మధుసూదన్ రావు**

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 04(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా వెలమ అసోసియేషన్ నూతన పాలకవర్గ ఎన్నికల్లో అన్ని పదవులూ ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం పోటీలో మిగిలిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రధాన ఎన్నికల అధికారి మధుసూదన్ రావు ఆదివారం అధికారికంగా ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా బల్గూరి రాజేశ్వర్ రావు న్యాల్కల్, ప్రధాన కార్యదర్శిగా బీరెల్లి విజయరావు మెట్‌పల్లి, కోశాధికారిగా మార్నేని పాపేశ్వర్ రావు నిజాంపూర్ లు ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు మరియు డైరెక్టర్లను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి పలువురు సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.



# రైతు హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 04(డీడీ9 వార్త) :**

అధికారం చేపట్టకముందు రైతులకు కొండంత ఆశ చూపి, తీరా అధికారం చేపట్టాక ఆ హామీలను గాలికొదేలేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీజేపీ కిసాన్ మోర్చా సమర శంఖం పూరించింది. రైతు మేనిఫెస్టో హామీల సాధనకై ఆదివారం భీంగల్‌లో సైకిల్ యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. రుణమాఫీ సగానికి సగం మందికి అందలేదని, రూ.500 వరి బోనస్‌లో కోతలు విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలు చేతికి వచ్చే సమయానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల కోతలు పూర్తయిన వెంటనే రైతులు దళారుల చేతుల్లో చిక్కి నిలువునా మోసపోతున్నారని వాపోయారు. ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకే ఈ సైకిల్ యాత్రను ఎంపీ ఆదేశాల మేరకు చేపట్టడం జరిగిందని స్పష్టం చేశారు. గత ఎనిమిది రోజులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న ఈ సైకిల్ యాత్ర బడా భీంగల్ నుండి బయలుదేరి భీంగల్ పట్టణానికి చేరుకుంది. భీంగల్ వాగు గుడి వద్ద యాత్రకు అపూర్వ స్వాగతం పలికిన అనంతరం బోదిరే గల్లీ ద్వారా బడా భీంగల్ రోడ్డు మీదుగా 50 మంది రైతుల భాగస్వామ్యంతో బస్టాండ్, పురానీపేట్ వరకు యాత్ర జోరుగా సాగింది. భోజనానంతరం జాగ్రియాల్ గుండా సాయంత్రానికి మోర్తాడ్ చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు నీలం గంగాధర్, మండల అధ్యక్షుడు అరి రవీందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట నీచ్, నవీన్, గంగాధర్, ప్రేమ్‌చందు, సర్పంచ్ నర్సింగ్‌రావు, సంజయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# పురుగుల మందు తాగి యువకుడి మృతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 04(డీడీ9 వార్త) :**

దాడికి గురై తీవ్ర మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నవీపేట్ మండల పరిధిలోని సిరన్‌పల్లిలో చోటుచేసుకుంది. నవీపేట్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డ్రైవర్ రావుల శివకుమార్ (38)పై అదే గ్రామానికి చెందిన జలేందర్, గంగాధర్, తేజ, పావని, సావిత్రి కలిసి దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శివకుమార్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తక్షణమే ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ నియామకం

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 04(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. సంఘ కార్యకలాపాలను మెరుగ్గా నిర్వహించేందుకు వీలుగా నూతన కార్యవర్గాన్ని పురుషుల, మహిళా, యూత్ అనే మూడు విభాగాలుగా విభజించి బాధ్యతలు అప్పగించారు. పురుషుల విభాగంలో సుగంధం మురళి, సుగంధం సతీష్, అంగిరేకుల సాయిలు, సోమినేని రాజేందర్, బంటు సత్యజిత్, బంటు ప్రవీణ్ కుమార్, ముచ్కూర్ నవీన్ కుమార్, నాయక్‌వాడ్ జగన్నాథ్, మల్కాయి సుదర్శన్, పెద్దగంటి లింబాద్రి స్వాములు నియమితులయ్యారు. మహిళా విభాగానికి లావణ్య, మెండి సునీత, చంద్రకళలను ఎంపిక చేశారు. అలాగే యూత్ విభాగంలో సూదం హరీష్, ఈర్ల శ్రీధర్, కౌడపు రణధీర్, ఉల్లెంగ నాగరాజ్‌లు బాధ్యతలు చేపట్టనున్నారు. సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ పిలుపునిచ్చారు.

# గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

- **ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట**

**భద్రాచలం టౌన్, అక్టోబరు 4 ( డీ డీ 9 వార్త)**

భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈకార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని, సంబంధిత ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు తప్పనిసరిగా భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లోని సమావేశ మందిరాలకు సకాలంలో హాజరుకావాలని పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట స్పష్టం చేశారు.



# ఐటీసీ ఉద్యోగాలు, వ్యాపారాల పేరుతో రూ.10 కోట్లకు పైగా మోసం

- **భద్రాచలం టౌన్ పోలీసుల కేసు నమోదు**

**భద్రాచలం టౌన్ అక్టోబర్ 04 (డీ డీ 9 వార్త)**

ఐటీసీ పేపర్‌బోర్డులో ఉద్యోగాలు, కాంట్రాక్టు పనులు ఇప్పిస్తామని, వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.10.21 కోట్లకుపైగా నగదు, 30 తులాల బంగారం కాజేసిన ఘటన భద్రాచలంలో వెలుగుచూసింది. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సింగల దేవి వేంకటరమణ ఫిర్యాదు మేరకు భేతంపూడి భరత్‌కుమార్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు భేతంపూడి రాజేశ్వరి, నక్కా సత్యనారాయణ, శబరీష్ సుబ్రహ్మణ్యన్, భేతంపూడి శ్రీవిద్యలపై భద్రాచలం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఐటీసీ ఉద్యోగాలు, కాంట్రాక్టు పనులతో పాటు శ్రీ సూర్యప్రియ ఇంజనీరింగ్ వర్క్స్, బీకే నాయుడు అండ్ కో సంస్థల్లో పెట్టుబడులకు నెలకు 3 శాతం లాభాలు ఇస్తామని నమ్మించి బాధితుడి నుంచి రూ.10,21,33,284 వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ వేడుక పేరుతో 30 తులాల బంగారు ఆభరణాలు కూడా తీసుకున్నట్లు తెలిపారు. కొంతకాలం లాభాలు చెల్లించి అనంతరం నిలిపివేయడంతో బాధితుడు డబ్బులు, బంగారం తిరిగి ఇవ్వాలని కోరాడు. దీంతో నిందితులు ఇళ్లకు తాళాలు వేసి, ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రధాన నిందితుడు భరత్‌కుమార్‌పై ఇప్పటికే లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కేసు ఉండగా, ఆ కేసులో అరెస్టయి ప్రస్తుతం భద్రాచలం సబ్‌జైలులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# ఏరియల్ వీడియోగ్రఫీలో భద్రాచలం యువకుడి జయకేతనం

- **ఎలివేట్ - 2026లో ఎడ్వర్డ్ రాజుకు ప్రథమ స్థానం**

**భద్రాచలం టౌన్, అక్టోబరు 4 (డీ డీ 9 వార్త)**

సృజనాత్మకతకు సాంకేతికతను జోడిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని భద్రాచలానికి చెందిన గంజి ఎడ్వర్డ్ రాజు నిరూపించారు. డ్రోన్ వీడియోగ్రఫీలో తనకున్న నైపుణ్యంతో రూపొందించిన ఏరియల్ వీడియోకు ప్రతిష్టాత్మక 'ఎలివేట్ 2026' పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. తద్వారా జాతీయ స్థాయి డ్రోన్ వీడియోగ్రఫీ వేదికపై భద్రాచలం పేరును నిలిపారు. గోదావరి తీర ప్రాంతంలో చిత్రీకరించిన వీడియోలో ప్రకృతి అందాలు, నదీ ప్రవాహం, తీర ప్రాంత వాతావరణంతో పాటు అక్కడ కనిపించిన మొసళ్ల కదలికలను ఎడ్వర్డ్ రాజు ప్రత్యేకమైన ఏరియల్ యాంగిల్స్ లో చిత్రీకరించారు. సహజ దృశ్యాలను ఆకట్టుకునే విధంగా చూపించడంతో ఈ వీడియోకు న్యాయనిర్ణేతల నుంచి మంచి స్పందన లభించింది. ఎడిట్ పాయింట్ , పీపీఐఎన్ , డ్రోనిక ఇన్నోవేషన్స్ సంయుక్తంగా నిర్వహించిన 'ఎలివేట్ 2026 డ్రోన్ ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ' పోటీల్లో సుమారు 200 మంది తమ ప్రతిభను ప్రదర్శించారు. నేచర్ , కల్చర్ , ఇన్ ఫ్రాస్ట్రక్చర్ , సెలబ్రేషన్ , అవాటా 360, ఎఫ్ పీవీ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన 30 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. ఏరియల్ వీడియోగ్రఫీనేచర్ విభాగంలో ఎడ్వర్డ్ రాజు రూపొందించిన వీడియో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ శంషాబాద్ లోని ఎస్ ఎస్ కన్వెన్షన్స్ లో అక్టోబర్ 2 నుంచి 4 వరకు జరిగిన 'ఫొటో ట్రేడ్ ఎక్స్ పో హైదరాబాద్ 2026'లో విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎడ్వర్డ్ రాజుకు ప్రథమ స్థానానికి సంబంధించిన సర్టిఫికెట్ ను అందజేయడంతో పాటు 'బెస్ట్ డ్రోన్ వీడియోగ్రాఫర్ 'గా భారత్ కళా పురస్కార్ 2026 ట్రోఫీని ప్రదానం చేశారు. డ్రోన్ టెక్నాలజీని సృజనాత్మకంగా వినియోగించి ప్రత్యేక గుర్తింపు సాధించిన ఎడ్వర్డ్ రాజును భద్రాచలం ప్రాంతానికి చెందిన పలువురు అభినందించారు.

# 108 అంబులెన్స్‌లో మహిళకు సుఖప్రసవం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 04(డీడీ9 వార్త) :**

ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్స్‌లోనే ఓ మహిళ సుఖప్రసవమైంది. వివరాల్లోకి వెళ్తే.. బోధన్ మండలం కొప్పర్గ గ్రామానికి చెందిన అనూషబాయికి ఆదివారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో నొప్పులు తీవ్రతరం కావడంతో పరిస్థితిని గమనించిన సాలూర 108 సిబ్బంది ఈఎంటీ నాగేంద్రబాబు, పైలట్ సతీష్ తక్షణమే స్పందించారు. అంబులెన్స్‌ను పక్కకు నిలిపి చాకచక్యంగా ప్రసవం చేయడంతో ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని, తదుపరి వైద్య చికిత్స కోసం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు 108 సిబ్బంది తెలిపారు. తక్షణమే స్పందించిన సిబ్బందిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.



# ఆరోగ్యశ్రీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా లీలిపుష్ప

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 04(డీడీ9 వార్త) :**

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన లీలిపుష్ప, ఈసీ మెంబర్‌గా కామారెడ్డి జిల్లాకు చెందిన కృష్ణవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన యూనియన్ రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర యూనియన్ నాయకత్వానికి, సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# మద్నూర్ మండలాన్ని నిజామాబాద్‌లో కలపాలి

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 04(డీడీ9 వార్త) :**

మద్నూర్ మండలాన్ని కామారెడ్డి జిల్లా నుంచి వేరు చేసి నిజామాబాద్ జిల్లాలో కలపాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. గత నెల ప్రజావాణి కార్యక్రమంలో 20 మందికి పైగా బాధితులు వినతిపత్రం అందజేయగా, జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆర్‌డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు సర్క్యులర్ జారీ చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు మంచిదే అయినప్పటికీ, మద్నూర్ మండలానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఆ పరిణామాన్ని నిరసిస్తూ గతంలో స్థానిక తహసీల్దార్ ఆఫీస్ ఎదుట నిరసనలు కూడా సాగాయి. మద్నూర్ నుంచి కామారెడ్డి వెళ్లాలంటే దాదాపు 110 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోందని, నిజామాబాద్‌లో విలీనం చేస్తే 40 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందని ప్రజలు వివరిస్తున్నారు. రాష్ట్రంలో మరే మండలానికి లేని విధంగా 100 కిలోమీటర్లకు పైగా దూర భారాన్ని మోస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించి ప్రజా ఆకాంక్షను నెరవేర్చాలని మండల వాసులు కోరుతున్నారు

# కోటగిరిలో అట్టహాసంగా ముగిసిన KCC క్రికెట్ టోర్నమెంట్ సీజన్-5

- **విజేతగా నిలిచిన కోటగిరి జట్టు!**

**కోటగిరి అక్టోబర్ 04 (డిడి9 వార్త): నిజామాబాద్ జిల్లా**

స్థానిక కోటగిరి గ్రామంలో గత కొన్ని రోజులుగా ఎంతో ఉత్కంఠభరితంగా సాగుతున్న KCC క్రికెట్ టోర్నమెంట్ సీజన్5 గ్రాండ్ ఫినాలే మ్యాచ్‌తో అత్యంత వైభవంగా ముగిసింది. క్రీడాభిమానులు, గ్రామస్తుల భారీ కోలాహలం మధ్య జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులకు అసలైన క్రికెట్ మజాను పంచింది. టోర్నమెంట్‌లో అంతిమ పోరుకు చేరిన ఇరు జట్లు విజయాన్నే లక్ష్యంగా పెట్టుకుని బరిలోకి దిగడంతో మైదానంలో హోరాహోరీ పోరు సాగింది.

**ఉత్కంఠ రేపిన చివరి ఓవర్ల పోరు:**

మొదటి నుండి ఇరు జట్లు వ్యూహాత్మకంగా ఆడుతూ పరుగుల వేటను కొనసాగించాయి. నిర్ణీత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో/ కాపాడుకునే క్రమంలో మ్యాచ్ ప్రతి ఓవర్‌లోనూ మలుపులు తిరుగుతూ, చివరి బంతి వరకు ఉత్కంఠను రేకెత్తించింది. అయితే, ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన ఫీల్డింగ్, కట్టుదిట్టమైన బౌలింగ్ మరియు అసాధారణమైన బ్యాటింగ్ ప్రతిభను కనబరిచిన [ఇక్కడ విజేత టీమ్ పేరు రాయండి] జట్టు పైచేయి సాధించింది. తమ అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థి జట్టుపై ఘన విజయం సాధించి, KCC సీజన్5 ఛాంపియన్‌గా అవతరించింది.





# ప్రభుత్వ వరి ధాన్యం కాంట ప్రారంభోత్సవానికి ఆహ్వానం

- **రేపు పోతంగల్ రైస్ మిల్‌లో ప్రారంభోత్సవం**

**పోతంగల్, అక్టోబర్ 4: (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్‌లోని విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ వరి ధాన్యం కాంట ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి తెలిపారు. అక్టోబర్ 5, సోమవారం ఉదయం 11.30 గంటలకు పోతంగల్ రైస్ మిల్‌లో ప్రభుత్వ వరి ధాన్యం కాంట ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానాన్ని తెలియజేశారు.

**ఇట్లు:**
**సంఘ ఇన్‌చార్జి కార్యదర్శి**
**విశాల సహకార పరపతి సంఘం,**
**పోతంగల్**




# ప్రపంచకప్‌కు ముందు అదే టెన్షన్.. ఆ రెండు విభాగాల్లో తాము వీక్ అన్న కెప్టెన్ గిల్

- **విండీస్‌పై సిరీస్ గెలిచినా కొన్ని లోపాలపై దృష్టి సారించిన కెప్టెన్ గిల్**
- **ఫీల్డింగ్, డెత్ ఓవర్ల బౌలింగ్‌లో ఇంకా మెరుగుపడాలని వ్యాఖ్య**
- **సిరీస్ మొత్తంలో ఆరు, ఏడు క్యాచ్‌లు జారవిడవడంపై అసంతృప్తి**
- **చివరి వన్డేలో స్లో ఓవర్ రేట్ కూడా ప్రభావం చూపిందన్న గిల్**
- **ప్రపంచకప్‌కు ముందు ఫీల్డింగ్ అత్యున్నత స్థాయిలో ఉండాలని స్పష్టీకరణ**



**డీడీ9 వార్త :**

వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత జట్టు 21 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, ఈ సిరీస్ విజయం కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు పూర్తి సంతృప్తిని ఇవ్వలేదు. ముఖ్యంగా ఫీల్డింగ్, డెత్ ఓవర్ల బౌలింగ్ విభాగాల్లో జట్టు ఇంకా చాలా మెరుగుపడాల్సి ఉందని గిల్ స్పష్టం చేశాడు. నిన్న న్యూ చండీగఢ్‌లో జరిగిన మూడో, చివరి వన్డేలో భారత్ ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశాడు.

మ్యాచ్ తర్వాత ప్రజెంటేషన్ కార్యక్రమంలో గిల్ మాట్లాడుతూ.. "ఈ సిరీస్‌లో చాలా విషయాలు మాకు అనుకూలంగా జరిగాయి. అయితే, కొన్ని అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మూడో వన్డేలో మేము 351 పరుగులు చేయడం మంచి స్కోరే. చాలా సేపటి వరకు మ్యాచ్ మా నియంత్రణలోనే ఉంది. కానీ చివరి దశలో వెస్టిండీస్ అద్భుతంగా ఆడి మ్యాచ్‌ను మా నుంచి లాగేసుకుంది" అని తెలిపాడు.

స్లో ఓవర్ రేట్ కూడా జట్టును దెబ్బతీసిందని, నిర్ణీత సమయానికి నాలుగు ఓవర్లు వెనుకబడి ఉండటంతో డెత్ ఓవర్లలో ఫీల్డింగ్ నిబంధనలు ప్రతికూలంగా మారాయని వివరించాడు. డెత్ బౌలింగ్ గురించి గిల్ ప్రత్యేకంగా ప్రస్తావించాడు. ప్రత్యర్థి జట్టు ఐదారు వికెట్లు కోల్పోయినప్పుడు అటాకింగ్ బౌలింగ్ వేయాలా లేక పరుగులు కట్టడి చేస్తూ డిఫెన్సివ్‌గా ఆడాలా అనే వ్యూహంపై కొన్నిసార్లు అనిశ్చితి నెలకొంటోందని అభిప్రాయపడ్డాడు. ఈ విషయంపై మరింత స్పష్టత అవసరమని సూచించాడు.

అన్నింటికంటే ముఖ్యంగా ఫీల్డింగ్‌పై గిల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ సిరీస్ మొత్తంలో తమ ఫీల్డర్లు సుమారు ఆరు నుంచి ఏడు క్యాచ్‌లను జారవిడిచారని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నాడు. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీకి ముందు ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని వ్యాఖ్యానించాడు.

జట్టు పురోగతిపై తాను సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ, ఫీల్డింగ్ మాత్రం అత్యున్నత స్థాయిలో ఉండాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని స్పష్టం చేశాడు.

# ఇరానీ కప్ రెస్టాఫ్ ఇండియా కైవసం.. ముఖేష్ కుమార్ దెబ్బకు జమ్మూ కశ్మీర్ చిత్తు

- **ఇరానీ కప్‌ను 31వ సారి గెలుచుకున్న రెస్టాఫ్ ఇండియా**
- **జమ్మూ కశ్మీర్‌పై 167 పరుగుల తేడాతో ఘన విజయం**
- **ఆరు వికెట్లతో జమ్మూ కశ్మీర్ పతనాన్ని శాసించిన పేసర్ ముఖేష్ కుమార్**
- **రెండో ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే కుప్పకూలిన రంజీ ఛాంపియన్ జట్టు**
- **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన స్మరణ్ రవిచంద్రన్**



**డీడీ9 వార్త :**

ఫాస్ట్ బౌలర్ ముఖేష్ కుమార్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో రెచ్చిపోవడంతో రెస్టాఫ్ ఇండియా జట్టు 31వ సారి ఇరానీ కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. షేర్‌ఇకశ్మీర్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రంజీ ట్రోఫీ ఛాంపియన్ జమ్మూ కశ్మీర్‌ను 167 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. ఆదివారం, నాలుగో రోజు 279 పరుగుల లక్ష్య ఛేదనలో జమ్మూ కశ్మీర్ జట్టు పేకమేడలా కుప్పకూలింది.

లంచ్ విరామానికి 89/3 స్కోరుతో పటిష్ఠంగానే కనిపించిన జమ్మూ కశ్మీర్, విరామం తర్వాత గంట వ్యవధిలోనే చేతులెత్తేసింది. ముఖ్యంగా ముఖేష్ కుమార్ తన అద్భుతమైన స్పెల్‌తో ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. కేవలం 33 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 11వ సారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఒకే ఓవర్‌లో నాలుగు బంతుల వ్యవధిలో మూడు వికెట్లు తీసి జమ్మూ కశ్మీర్ మిడిలార్డర్ వెన్ను విరిచాడు. అతనికి ఆకాశ్ దీప్ (3/25) చక్కటి సహకారం అందించాడు. మరో పేసర్ ముఖేష్ చౌదరి కీలకమైన అబ్దుల్ సమద్ వికెట్‌ను తీశాడు. దీంతో కశ్మీర్ జట్టు 28.4 ఓవర్లలో కేవలం 111 పరుగులకే ఆలౌటైంది. ఆ జట్టులో శుభమ్ ఖజురియా (36), కమ్రాన్ ఇక్బాల్ (32), అబ్దుల్ సమద్ (20) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు.

అంతకుముందు, రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 237 పరుగులు చేయగా, జమ్మూ కశ్మీర్ 278 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో స్మరణ్ రవిచంద్రన్ (135) అద్భుత సెంచరీతో రెస్టాఫ్ ఇండియా 319 పరుగులు చేసి తిరిగి పోటీలోకి వచ్చింది. స్మరణ్ తొలి ఇన్నింగ్స్‌లోనూ 68 పరుగులతో రాణించడంతో అతనికి "ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్" అవార్డు లభించింది. జ్వరంతో బాధపడుతున్న రెగ్యులర్ కెప్టెన్ రిషభ్ పంత్ డగౌట్‌కే పరిమితం కాగా, అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ కెప్టెన్‌గా జట్టును విజయపథంలో నడిపించాడు. పంత్ పుట్టినరోజున ఈ విజయం అతనికి మంచి బహుమతిగా నిలిచింది. కాగా, రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 20కి పైగా నోబాల్స్ వేయడం జమ్మూ కశ్మీర్ ఓటమికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచింది.

# ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదు.. వారి అనుభవమే మా విజయానికి కారణమైంది

- **ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్న భారత పురుషుల క్రికెట్ జట్టు**
- **ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదని వ్యాఖ్యానించిన సంజూ శాంసన్**
- **అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండటమే విజయానికి కారణమని వెల్లడి**
- **ఫైనల్ ఒత్తిడిని అధిగమించడంలో సీనియర్లు కీలకపాత్ర పోషించారన్న సంజూ**





**డీడీ9 వార్త :**

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఉత్కంఠభరిత ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే, ఈ స్వర్ణం తమకు సులభంగా దక్కలేదని, దీనికోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నాడు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన 'ఏ' టీమ్‌ను బరిలోకి దించడం వల్లే పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడిని అధిగమించగలిగామని స్పష్టం చేశాడు.

ఈ విజయం అనంతరం సంజూ శాంసన్ మాట్లాడుతూ.. "మాది చాలా అనుభవజ్ఞులైన జట్టు. ప్రాక్టీస్, మ్యాచ్‌లు లేనప్పుడు కూడా మమ్మల్ని మేము ఎలా ప్రేరేపించుకోవాలో, శక్తిని ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు. ఆసియా క్రీడలకు 'ఏ' టీమ్‌ను తీసుకురావడం నిజంగా కలిసి వచ్చింది. పాకిస్థాన్‌తో ఫైనల్‌లో అదే జరిగింది. అందరికీ ఇది ఒక సరైన మ్యాచ్‌లా అనిపించింది" అని వివరించాడు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ అద్భుత అర్ధసెంచరీలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగానే పోరాడింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై దూకుడుగా ఆడి, చివరి వరకు మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. అయితే, భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాకిస్థాన్ 6 వికెట్లు కోల్పోయి 192 పరుగులకే పరిమితమైంది.

"చివరకు ఒక మంచి మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. మేం 200 పరుగులు చేశాక పాకిస్థాన్‌కు ఛేజింగ్ కష్టమవుతుందని అనుకున్నాం. కానీ, వికెట్ బాగుండటంతో వాళ్లు కూడా బాగా ఆడారు. ప్రేక్షకులకు ఒక మంచి ఫైనల్ చూసే అవకాశం దక్కింది. ఈ స్వర్ణం మాకు సులభంగా దక్కలేదు. కష్టపడి సాధించాం కాబట్టే ఎక్కువ సంతృప్తినిచ్చింది. మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం" అని సంజూ పేర్కొన్నాడు. ఆసియా క్రీడల ఫైనల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప అవకాశమని, అయితే ఆట ప్రారంభమయ్యాక పరిస్థితులకు అనుగుణంగానే ఆడామని, ఒత్తిడిని దరిచేరనీయలేదని సంజూ స్పష్టం చేశాడు.

DD9 వార్త తెలుగు దినపత్రిక

## సినిమా చూసిన వాళ్లంతా కన్నీళ్లతో బయటకొస్తున్నారు!

'యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులూ తప్పక చూడాల్సిన సినిమా 'తెల్ల కాగితం'' అన్నారు దర్శకుడు రమేశ్ బండ్రెడ్డి. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటించిన సంగతి తెలిసిందే. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ.. "స్వచ్ఛమైన మనసులన్నీ కలిసి ఓ సినిమా చేస్తే అదెలా ఉంటుందన్నదే ఈ చిత్రం. పిల్లలతో పాటు పెద్దవాళ్లు, కుటుంబ ప్రేక్షకులు థియేటర్‌కి వెళ్లి మా చిత్రం చూడటం ఆనందాన్నిస్తోంది" అన్నారు. "ఈ సినిమాకి అన్ని ఏరియాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సినిమాలో రోషన్ ఏడుస్తుంటే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ చిత్రాన్ని నమ్మి కొన్న ఈటీవీ విన్ యాజమాన్యానికి శుభాకాంక్షలు" అన్నారు నిర్మాత బెక్కెం వేణుగోపాల్. ఈ కార్యక్రమంలో నక్షత్ర, శ్రావ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆ పాత్ర అయితే వెంటనే ఒప్పేసుకుంటా!



"ఎంచుకునే పాత్రలతోనే ఎప్పటికీ గుర్తుండిపోవాలని, అలాగే ఏదైనా మంచి పనిచేసేలా ఇతరులకు స్ఫూర్తినివ్వాలని నేను కోరుకుంటున్నా" అని అంటున్నారు అందాల తార కృతి శెట్టి. జయాపజయాలతో సంబంధం లేకుండా ఎదురైన అవకాశంతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోన్న ఈమె.. ఈ ఏడాది ప్రారంభంలోనే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' లాంటి చిత్రాలతో తెరపై మెరిశారు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి మాట్లాడుతూ.. "నా వృత్తిని నేను ఎంతగానో ప్రేమిస్తున్నా. అందుకే మరింత బలమైన నటిగా ఎదగడానికి చేయగలిగినదంతా చేయాలనుకుంటున్నా. నేను నటించే సినిమాలతో ప్రేక్షకుల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకురావడమే నా లక్ష్యం. భావోద్వేగభరితమైన పాత్రలు పోషించడంలో నాకు మంచి పట్టు ఉంది. కానీ నా కలల పాత్ర మాత్రం పూర్తిగా భిన్నమైంది. ఒక యువరాణి లేదా యోధురాలిగా నటించాలనేది నా కోరిక. దీని కోసం ముందే ఓ ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నా. ఆ పాత్రతో ఎవరైనా నా ఇంటి తలుపు తట్టి పిలుస్తారేమో అని ఎదురుచూస్తున్నా. ఒక వేళ అలాంటి అవకాశం వస్తే.. రెండు వారాల్లోనే షూటింగ్‌లో కూడా పాల్గొంటా" అని చెప్పారు.

## సుకుమార్ దగ్గరే పని చేయాలని మూడేళ్లు తిరిగా..



టాలీవుడ్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, ఇండస్ట్రీలోకి రాకముందు పడిన కష్టాల గురించి తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకున్న ఆసక్తికర విషయాలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ డైరెక్టర్ సుకుమార్ కోసం ఆయన పడిన తపన అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ.. తాను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే శేషు అనే సర్ ద్వారా దర్శకుడు సుకుమార్‌తో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఆ పరిచయంతోనే ఆయన దగ్గర అవకాశం కోసం ప్రయత్నించినప్పటికీ మొదట్లో కుదరలేదన్నారు. ఆ తర్వాత 'ఆర్య-2' సినిమా సమయానికి అన్నపూర్ణ స్టూడియోస్‌లో సుకుమార్‌ని మరోసారి కలిశానని, అప్పుడే ఆయనతోనే పనిచేయాలని గట్టిగా డిసైడ్ అయినట్లు పేర్కొన్నారు.

ఆ నిర్ణయంతోనే ఏకంగా మూడేళ్ల పాటు సుకుమార్ ఇంటి చుట్టూ తిరిగినట్లు శ్రీకాంత్ తెలిపారు. అలా రోజులు తిరిగేసరికి ఒకరోజు విసిగిపోయిన సుకుమార్.. తాను ఎవరని, అసలు ఏం కావాలని కోపంగా అడిగారని చెప్పారు. అప్పుడు తాను అసిస్టెంట్ డైరెక్టర్ కావాలనుకుంటున్నట్లు తెలిపానని, వెంటనే ఒక షార్ట్ ఫిలిం తీసి తీసుకురమ్మని సుకుమార్ సూచించారన్నారు. ఆ తర్వాత తను ఒక షార్ట్ ఫిలిం తీసి చూపించడంతో సుకుమార్ తనను టీమ్‌లోకి తీసుకున్నారని తెలిపారు. అయితే ఆయన దగ్గర కేవలం రెండు సినిమాలకు మాత్రమే అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని శ్రీకాంత్ చెప్పారు. సుకుమార్ దగ్గర చేరడానికి ముందే దేశంలోనే నెంబర్ వన్ దర్శకుడి దగ్గర నుంచి తనకు ఆఫర్ వచ్చినప్పటికీ, సుకుమార్ మీదున్న ఇష్టంతో ఆ అవకాశాన్ని వదులుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## ఇది డిజిటల్ లైంగిక దాడితో సమానం..



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర' చిత్రంలోని సూపర్ హిట్ సాంగ్ 'చుట్టమల్లె'కు సంబంధించిన ఏఐ మార్ఫింగ్ వీడియో ప్రస్తుతం నెట్టింట తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వీడియోలో జాన్వీ కపూర్‌ను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తుండటంపై సినీ సెలబ్రిటీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఘటనపై ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ వార్నింగ్ ఇవ్వగా, తాజాగా రౌడీ హీరో విజయ్ దేవరకొండ ట్విట్టర్ వేదికగా ఘాటుగా స్పందించారు. మనం పూర్తిగా నీచ స్థాయికి దిగజారామని, దీనికి బాధ్యులైన వారిని అసలు వదిలిపెట్టకూడదని అన్నారు. వీరు అత్యంత కఠినమైన చట్టపరమైన శిక్షలను ఎదుర్కొని, భవిష్యత్తులో ఇతరులకు ఇదొక గుణపాఠంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సమాజంలో మనుషుల దయ, ఒకరినొకరు గౌరవించుకునే గుణం పోయిందని.. కించపరచుకోవడంలో ఆనందం పొందే సమాజంలో మనం జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు ఎలా పోతాయని, జీవనోపాధి ఎలా దెబ్బతింటుందని భయపడుతుంటే.. కొందరు మూర్ఖులు మాత్రం ఇదే టెక్నాలజీని ఇలాంటి నీచమైన పనులకు వాడుతున్నారని మండిపడ్డారు. ఇది కేవలం వీడియో మార్ఫింగ్ కాదని, డిజిటల్ రూపంలో జరిగిన లైంగిక దాడి అని విజయ్ అన్నారు. ఇలాంటి చర్యలను చట్టం అత్యంత తీవ్రంగా పరిగణించాలని,

## తప్పు చేసినవారిని వదిలేసి బాధితులనే ఎందుకు విమర్శిస్తారు?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలకు కొంత విరామం ఇచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. తల్లి కాబోతుండటంతో గ్యాప్ తీసుకున్నారు. అయితే సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియా ద్వారా ఆమె ఎప్పుడూ అభిమానులకు టచ్‌లో ఉంటుంటారు. ముఖ్యంగా సమాజంలో జరిగే విషయాలపై, మహిళల మీద జరిగే తప్పులపై ఆమె స్పందిస్తూ పెడుతూ ఉండే పోస్టులు ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి. తాజాగా సమంత సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ పెద్ద చర్చకు దారితీసింది. సమాజంలో కొందరు ఆలోచించే తీరును, మనస్తత్వాన్ని ఆమె ఈ పోస్ట్ ద్వారా చాలా గట్టిగా ప్రశ్నించారు. మనం ఇప్పటికైనా ఆలోచనలు మార్చుకోవాలని సమంత కోరారు.

సమాజంలో లైంగిక కార్మికులను తప్పుపడతారు కానీ వారి దగ్గరకు వెళ్లే క్లయింట్లను ఎవరూ ఏమీ అనరని సమంత పేర్కొన్నారు. ఒంటరి తల్లులను విమర్శిస్తారు కానీ పిల్లల బాధ్యత తీసుకోని తండ్రులను ఎవరూ ప్రశ్నించరని ఆమె తెలిపారు. అలాగే అత్యాచారం జరిగినప్పుడు బాధితురాలినే తప్పుపడతారు కానీ తప్పు చేసిన వారిని కాదని, తప్పును కప్పిపుచ్చే వారిని వదిలేసి ఆ తప్పు గురించి ధైర్యంగా బయటపెట్టి మాట్లాడేవారినే విమర్శించే లోకంలో మనం బతుకుతున్నామని ఆమె తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. సమాజంలో ఉన్న ఈ చెడ్డ పద్ధతులను, తప్పుడు ఆలోచనలను సమంత తన మాటలతో నిలదీశారు. ఇప్పుడు ఈ పోస్ట్ నెట్టింట విపరీతంగా షేర్ అవుతోంది. ఇలాంటి ముఖ్యమైన విషయంపై సమంత ధైర్యంగా స్పందించడం పట్ల ఆమె అభిమానులు, నెటిజన్లు ఆమెకు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారు.

## సెన్సార్ పూర్తి చేసుకున్న 'కామ్రేడ్ కల్యాణ్'..




టాలీవుడ్ టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద కొన్నిసార్లు అదృష్టం = కలిసి రావడం లేదు. అయినప్పటికీ ఏమాత్రం నిరాశ చెందకుండా వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ, ముఖ్యంగా కామెడీ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూ ఫుల్ జోరుమీదున్నారు. ఇప్పుడు అదే జోరుతో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. జానకీరామ్ మారెళ్ల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే రాధిక శరత్ కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రలలో కనిపించబోతున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్, కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్నాటీ, సీతా కర్నాటీ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను అక్టోబర్ 9న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో తాజాగా, ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్నట్లు హీరో శ్రీవిష్ణు అభిమానులతో పంచుకున్నారు. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి 'U/A' సర్టిఫికెట్ లభించినట్లు తెలిపారు. అంతేకాకుండా, సినిమాలో ఎలాంటి తుపాకుల కాల్పులు ఉండవని, కేవలం నవ్వుల సందడి మాత్రమే ఉంటుందని ఆయన ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ జత చేశారు. వైవిధ్యమైన కామెడీతో రానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

## శారీరకంగా సంతృప్తినిచ్చే బంధాలను ఏర్పరుచుకుంటున్నారు..



బాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకురాలు, ఆమిర్ ఖాన్ మాజీ భార్య కిరణ్ రావు నేటి తరం యువత రిలేషన్‌షిప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నేటి యువత ఆలోచనా విధానం, బంధాల పట్ల వారిస్తున్న అభిప్రాయాలపై ఆమె ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. తన కాలంతో పోలిస్తే ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పు వచ్చిందని కిరణ్ రావు చెప్పారు. నేటి యువతలో ఒక రకమైన స్వేచ్ఛ, ఎలాంటి సంకోచం లేని భావన స్పష్టంగా కనిపిస్తోందని ఆమె తెలిపారు. కాలం మారింది, దానికి తగ్గట్టుగానే మనుషులు తమ భావాలను వ్యక్తపరిచే పద్ధతులు కూడా పూర్తిగా మారిపోయాయని ఆమె పేర్కొన్నారు. ఒకరిపై ఒకరు ఇష్టం పెంచుకున్న ఇద్దరు యువతీయువకులు, ఎలాంటి బంధనాలు లేదా కట్టుబాట్లు లేనప్పుడు వారి ప్రయాణం ఎలా ఉంటుంది? వారు తీసుకునే నిర్ణయాల వల్ల ఎలాంటి ఊహించని పరిణామాలు ఎదురవుతాయి? అనే విషయాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. తాను యువతిగా ఉన్న రోజుల్లో ఒక వ్యక్తితో కేవలం ఒకే రకమైన కట్టుబాట్లతో కూడిన సంబంధం మాత్రమే ఉండాలనే నిబంధన ఉండేదని గుర్తుచేసుకున్నారు. అది శారీరక సంబంధం కావచ్చు, లేదా పెద్దలు కుదిర్చిన పెళ్లి తర్వాత ఏర్పడే బంధం కావచ్చు అని వివరించారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని కిరణ్ రావు స్పష్టం చేశారు. పెళ్లి అనే బంధంతో సంబంధం లేకుండానే చాలామంది గాఢమైన, భావోద్వేగపరంగా సంతృప్తినిచ్చే రిలేషన్స్‌లో ఉంటున్నారని చెప్పారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.